
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
సంగారెడ్డి మెదక్
5
శుక్రవారం 9 ఫిబ్రవరి 2024
జిల్లాల వార్తలు







ఓ సిలిండర్ అప్పివ్వరూ..!

జహీరాబాద్‌లో గ్యాస్ డెలీ'వర్రీ'

బుక్ చేసిన 10 రోజులకు కూడా ఇళ్లకు చేరని సిలిండర్

వస్తుందో.. రాదో గ్యారెంటీ లేదు!

వారానికో గ్రామానికి పంపిణీ

సర్వీస్‌చార్జీల పేరిట అదనంగా వసూలు

కేవైసీ కోసం దుకాణాల ఎదుట బారులు

జహీరాబాద్, జనవరి 8: జహీరాబాద్‌లో వంటగ్యాస్ కొరత వేధిస్తున్నది. అడగ్గానే సిలిండర్ ఇస్తున్నామని చెబుతున్నప్పటికీ క్షేత్రస్థాయిలో పరిస్థితులు మాత్రం ఇందుకు భిన్నంగా ఉన్నాయి. సిలిండర్ కోసం ఆన్‌లైన్‌లో బుక్ చేసినా 10 రోజులు దాటినా గ్యాస్ సిలిండర్ మాత్రం రావడం లేదు. దీంతో పక్కవారి దగ్గర అరువు తెచ్చుకోవడం లేదా కట్టెలపొయ్యిని ఆశ్రయించడమే దిక్కవుతున్నది. జహీరాబాద్ నియోజకవర్గంలో గ్యాస్ ఏజెన్సీలపై ఉన్నతాధికారుల పర్యవేక్షణ కొరవడడంతో నిర్వాహకులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు.

నియోజకవర్గంలో లక్ష కనెక్షన్లు

జహీరాబాద్ డివిజన్‌లో వివిధ కంపెనీలకు చెందిన 5 ఏజెన్సీలు ఉన్నాయి. వీటి పరిధిలో లక్షకు పైగా గ్యాస్ కనెక్షన్లు నమోదయ్యాయి. ప్రతీరోజు సగటున 1,800 నుంచి 2వేల సిలిండర్లను సరఫరా చేస్తుంటారు. గ్యాస్ సిలిండర్ కోసం వినియోగదారులు మొబైల్‌ఫోన్‌లో బుక్‌చేసుకుంటే మరుసటి రోజు సిలిండర్‌ను ఇంటికి పంపించాల్సి ఉంటుంది. కానీ డిమాండ్ అధికంగా ఉన్నప్పటికీ ఏజెన్సీల్లో వాహనాలు, సిబ్బంది కొరత తదితర సమస్యలతో సమయానికి గ్యాస్ సిలిండర్ డెలివరీ చేయడం లేదు. బుకింగ్ ప్రకారం కాకుండా వారంలో ఒక్కోరోజు ఒక్కో గ్రామం చొప్పున నిర్ణయించి సిలిండర్లను పంపిస్తుంటారు. ఆ రోజు తప్పితే మరుసటి వారమే మళ్లీ గ్యాస్ ఆటో ఊళ్లోకి వస్తుంది. ఇలా ఫోన్‌లో బుక్‌చేసి 15 రోజులైనా ఒక్కసారి గ్యాస్ రావడం లేదు.

అదనంగా వసూలు

వంట గ్యాస్ సిలిండర్ ధర ప్రస్తుతం రూ.975 ఉంది. నిబంధనల ప్రకారం గోదాం నుంచి 15 కిలోమీటర్ల లోపు డోర్ డెలివరీ కోసం ఎలాంటి అదనపు చార్జీలు వసూలు చేయొద్దు. కానీ ఇక్కడ మాత్రం డెలివరీబాయ్స్ ఒక్కో సిలిండర్‌పై అదనంగా రూ.50 వసూలు చేస్తున్నారు. ఇదేమిటని అడిగితే సిలిండర్ ఇవ్వడం లేదని, సిలిండర్‌పై ప్రభుత్వం అందజేసే సబ్సిడీ మొత్తం కూడా జమ కావడం లేదని వినియోగదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నిబంధనల ప్రకారం వినియోగదారుడి ఇంటికి తీసుకువెళ్లాక సిలిండర్‌ను చెక్‌చేసి ఇవ్వాల్సి ఉన్నా ఎక్కడా చేయడం లేదు. దీంతో నియోజకవర్గంలో చీలమామిడి, కొత్తూర్(బి), ఫయ్యాజ్‌నగర్ తదితర ప్రాంతాల్లో సిలిండర్లు పేలిన ఘటనలు నమోదయ్యాయి. ఇదే కాకుండా సింగిల్ సిలిండర్ ఉన్నవారు అదనంగా మరో సిలిండర్ తీసుకోవడానికి రూ.3,500 వసూలు చేస్తున్నట్లు ఆరోపణ లున్నాయి.

కేవైసీ కోసం బారులు

వంటగ్యాస్ కనెక్షన్‌ను కేవైసీ చేసుకునేందుకు గాను వినియోగదారులు ప్రతీ రోజు ఏజెన్సీల వద్ద బారులు తీరుతున్నారు. నిబంధనల ప్రకారం ఏజెన్సీల సిబ్బంది వినియోగదారుల ఇళ్ల వద్దకు వెళ్లి కైవైసీ నమోదు చేయాల్సి ఉంటుంది. కానీ ఏజెన్సీలు కేవైసీ కోసం దుకాణాల వద్దకే రప్పించడంతో వినియోగదారులు ఇబ్బందిపడుతున్నారు. కేవైసీ నమోదులో ఆలస్యంతో గంటల తరబడి వేచిచూడాల్సి వస్తున్నది. పనులను వదులుకుని కేవైసీ కోసం రావాల్సి వస్తుందని, ఇంటి వద్దనే కేవైసీ చేయించాలని వినియోగదారులు కోరుతున్నారు.



జహీరాబాద్ గ్యాస్ కేవైసీ కోసం బారులు తీరిన వినియోగదారులు

సంగారెడ్డి, మెదక్ జిల్లాల్లో

18,55,579 మంది ఓటర్లు

● తుది జాబితా విడుదల



ఆంధ్రజ్యోతి ప్రతినిధి, సంగారెడ్డి, ఫిబ్రవరి 8: పార్లమెంట్ ఎన్నికలకు సంబంధించి సంగారెడ్డి జిల్లాలో ఓటర్ల తుది జాబితాను జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతి గురువారం ప్రకటించారు. ఈ నెల 8వ తేదీ నాటికి జిల్లాలో ఓటర్ల సంఖ్య 14,12,688గా ఉన్నదని పేర్కొన్నారు. ఇందులో పురుషులు 7,08,437 మంది, మహిళలు 7,04,114 మంది, ఇతరులు 137 మంది ఉన్నారు. అసెంబ్లీ నియోజకవర్గాలవారీగా పరిశీలిస్తే అత్యధికంగా పటాన్‌చెరు నియోజకవర్గంలో 4,07,419 మంది ఓటర్లు ఉండగా, వీరిలో పురుషులు 2,09,757, మహిళలు 1,97,577, ఇతరులు 85 మంది ఉన్నారు. అతి తక్కువగా నారాయణఖేడ్ నియోజకవర్గంలో 2,35,571 మంది ఓటర్లుండగా వీరిలో పురుషులు 1,18,064 మంది, స్త్రీలు 1,17,498 మంది, ఇతరులు 9 మంది ఉన్నారు. అందోలులో 2,49,398 మంది ఓటర్లలో పురుషులు 1,22,026, మహిళలు 1,27,364, ఇతరులు 8 మంది ఉన్నారు. జహీరాబాద్‌లో 2,72,962 మంది ఓటర్లుండగా పురుషులు 1,36,569, మహిళలు 1,36,391, ఇతరులు 2 మంది ఉన్నారు. సంగారెడ్డిలో 2,47,338 మంది ఓటర్లలో 1,22,021 మంది పరుషలు, 1,25,284 మంది స్త్రీలు, ఇతరులు 33 మంది ఉన్నారు. పార్లమెంట్ ఎన్నికల నోటిఫికేషన్ వచ్చే వరకు ఓటు కోసం దరఖాస్తు చేసుకోవచ్చని సంగారెడ్డి జిల్లా రెవెన్యూ అధికారి నగేష్ తెలిపారు.

మెదక్ జిల్లాలో మహిళలే అధికం

మెదక్: మెదక్ జిల్లాలోని రెండు నియోజకవర్గాల్లో మొత్తం 4,42,891 మంది ఓటర్లున్నారని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రాజర్షిషా పేర్కొన్నారు. జిల్లా ఓటర్ల తుది జాబితాను గురువారం ఆయన విడుదల చేశారు. జనవరి 22 వరకు వచ్చిన దరఖాస్తులను పరిశీలించి తుదిఓటరు జాబితాను రూపొందించినట్లు తెలిపారు. ఈ జాబితాను అన్ని పోలింగ్ కేంద్రాల పరిధిలోని బూత్ లెవెల్ అధికారుల వద్ద, సహాయ ఎన్నికల రిటర్నింగ్ అధికారులుగా వ్యవహరించే తహసీల్దార్ కార్యాలయాల్లో, రిటర్నింగ్ అధికారుల కార్యాలయాల్లో అందుబాటులో ఉంచుతున్నట్లు ఆయన వివరించారు. జిల్లా పరిధిలోని మెదక్, నర్సాపూర్ అసెంబ్లీ నియోజకవర్గాల్లో పురుష ఓటర్ల కంటే మహిళలే అధికంగా ఉండడం విశేషం. జిల్లాలో 2,13,460 మంది పురుష ఓటర్లుండగా, 2,29,431 మంది మహిళా ఓటర్లున్నారు. 9 మంది ఎన్ఆర్ఐ ఓటర్లు, 126 మంది సర్వీస్ ఓటర్లు నమోదు చేసుకున్నారు. ఎన్ఆర్ఐ ఓటర్లలో 8 మంది పురుషులు కాగా, ఒకరు మహిళా ఓటరు ఉన్నారు. సర్వీస్ ఓటర్లలో 121 పురుషులు, 5 గురు మహిళా ఓటర్లు ఉన్నారని జిల్లా కలెక్టర్ పేర్కొన్నారు.

మెదక్ సెగ్మెంట్ పరిధిలో 274 పోలింగ్ కేంద్రాలు

మెదక్ అసెంబ్లీ సెగ్మెంట్ పరిధిలో 274 పోలింగ్ కేంద్రాలు, 2,16,743 మంది ఓటర్లు ఉన్నారని కలెక్టర్ వివరించారు. 1,03,654 మంది పురుష ఓటర్లు, 1,13,089 మహిళా ఓటర్లు, ఐదుగురు ఇతరులు, ఎనిమిమంది ఎన్ఆర్ఐ ఓటర్లు, 87 మంది సర్వీస్ ఓటర్లు ఉన్నారు.

నర్సాపూర్‌లో 305 పోలింగ్ కేంద్రాలు

నర్సాపూర్ అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో 305 పోలింగు కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ వివరించారు. 1,9,806 మంది పురుష ఓటర్లు, 1,16,342 మంది మహిళా ఓటర్లు, ఆరుగురు ఇతరులు ఒక ఎన్ఆర్ఐ, 39 మంది సర్వీస్ ఓటర్లు కలుపుకుని మొత్తం 2,26,148 మంది ఓటర్లు ఉన్నారని జిల్లా పాలనాధికారి వెల్లడించారు.

'మహాలక్ష్మి' వివరాలు పక్కాగా నమోదు

● రూ.500కే గ్యాస్ సిలిండర్ కోసం వివరాల సేకరణ

● ప్రజాపాలన దరఖాస్తుల్లో లోపాలను సరిచేయడానికి సర్వే

● టెలీ కాన్ఫరెన్స్‌లో మెదక్ కలెక్టర్ రాజర్షిషా

మెదక్ అర్బన్, ఫిబ్రవరి 8: కాంగ్రెస్ ఆరు గ్యారంటీల్లో భాగంగా ప్రకటించిన మహాలక్ష్మి పథకం కింద రూ.500కే గ్యాస్‌సిలిండర్‌ను త్వరలోనే అందజేయాలని ప్రభుత్వం యోచిస్తున్నదని జిల్లా కలెక్టర్ రాజర్షిషా పేర్కొన్నారు. పథకం అమలుపై గురువారం ఆయన అదనపు కలెక్టర్ రమేష్, నియోజకవర్గ ప్రత్యేక అధికారులు, తహసీల్దార్లు, ఎంపీడీవోలు, ఎంపీవోలు, డివిజన్ పంచాయతీ అధికారులు, మున్సిపల్ కమిషనర్లతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజాపాలన దరఖాస్తుల్లో గ్యాస్ కనెక్షన్‌కు సంబంధించి అసంపూర్తిగా ఉన్న వివరాలను సేకరించి నిర్ధారిత యాప్‌లో పొందుపర్చాలని ఆదేశించారు. ప్రధానంగా దరఖాస్తులో గ్యాస్‌ఏజెన్సీ పేరు, వినియోగిదారుడి నంబర్, రేషన్‌కార్డు నంబర్ తదితర వివరాలను నిర్ధారించుకోవాలని సూచించారు. అర్హులైన ఒక్కరు కూడా నష్టపోకూడదనే ప్రభుత్వం పొరపాట్లను సరిచేయడానికి ప్రత్యేక యాప్‌ను రూపొందించిందని పేర్కొన్నారు. వార్డుస్థాయిలో నియమించిన బృందాలు తమకు కేటాయించిన ప్రాంతాల్లో విస్తృతంగా పర్యటించి ఈ నెల 10 లోపు ప్రత్యేక యాప్‌లో వివరాలను నమోదు చేయాలని ఆదేశించారు.



వెల్దుర్తి మండలం ఉప్పులింగాపూర్‌లో మహాలక్ష్మి దరఖాస్తుల్లో పొరపాట్ల సవరణ సర్వేను పరిశీలిస్తున్న కలెక్టర్ రాజర్షిషా

మహాలక్ష్మి సర్వేను పరిశీలించిన కలెక్టర్

వెల్దుర్తి/మాసాయిపేట: వెల్దుర్తి మండల పరిధిలోని ఉప్పులింగాపూర్, మాసాయిపేట మండలం హకీంపేట, అచ్చంపేట గ్రామాల్లో మహాలక్ష్మి దరఖాస్తుల సవరణను కలెక్టర్ రాజర్షిషా గురువారం పరిశీలించారు. మొబైల్ యాప్‌లో వివరాల నమోదుపై సిబ్బందికి పలు సూచనలు చేశారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ జిల్లావ్యాప్తంగా ప్రజాపాలనలో మహాలక్ష్మి పథకానికి 1.57 లక్షల దరఖాస్తులు వచ్చాయని, ఇందులో దాదాపు 70వేల దరఖాస్తుల్లోని వివరాల్లో తప్పులు ఉన్నాయని తెలిపారు. అందుకే క్షేత్రస్థాయిలో లబ్ధిదారులను కలిసి తప్పులను సరిచేసి పక్కాగా వివరాలను మొబైల్‌యాప్‌లో నమోదు చేసేందుకు ప్రత్యేక బృందాలతో సర్వే నిర్వహిస్తున్నామని చెప్పారు.

రెవెన్యూ సీనియర్ అసిస్టెంట్ అరెస్ట్

● రూ. 3.74 కోట్లు రికవరీ చేయాలని ఆదేశాలు

● కలెక్టర్ ఆదేశాలతో పౌరసరఫరాలశాఖ డీఎం హరికృష్ణ ఫిర్యాదు

తూప్రాన్, ఫిబ్రవరి 8: తూప్రాన్ పట్టణ పౌరసరఫరాలశాఖ గోదాంలో బియ్యం, చక్కెర, గోనెసంచుల స్టాక్ తక్కువగా ఉండడంతో గోదాం ఇన్‌చార్జిగా పనిచేసిన రెవెన్యూశాఖ సీనియర్ అసిస్టెంట్‌పై క్రిమినల్ కేసులు నమోదు చేశారు. ఇప్పటికే సస్పెన్షన్‌లో ఉన్న ఆయనను పౌరసరఫరాలశాఖ జిల్లా మేనేజర్ హరికృష్ణ ఫిర్యాదు మేరకు శుక్రవారం అరెస్టు చేశారు. అధికారులు తెలిపిన వివరాల ప్రకారం తూప్రాన్ పౌరసరఫరాలశాఖ గోదాం నుంచి తూప్రాన్, మనోహరాబాద్, శివ్వంపేట మండలాలకు రేషన్ బియ్యం సరఫరా చేస్తుంటారు. ఈ గోదాంలో గత సంవత్సరం ఏప్రిల్ 15న విజిలెన్స్ తనిఖీలు నిర్వహించగా, బియ్యం నిల్వలు తక్కువగా ఉన్నట్లు గుర్తించారు. అప్పట్లో గోదాం ఇన్‌చార్జిగా ఉన్న తూప్రాన్ రెవెన్యూ సీనియర్ అసిస్టెంట్ నగేశ్ మరో కేసులో సస్పెన్షన్‌లో ఉండగా, అధికారులు క్షుణ్ణంగా దర్యాప్తు చేపట్టారు. గోదాములో నిల్వలు తక్కువగా ఉండడంపై మెదక్ కలెక్టర్ రాజర్షిషా అధికారులపై సీరియస్ అయినట్టు సమాచారం. రెవెన్యూ రికవరీ యాక్టును ప్రయోగించి తక్కువగా ఉన్న మొత్తం రికవరీ చేయాలని ఆయన ఆదేశాలు జారీ చేశారు. కలెక్టర్ ఆదేశాలతో జిల్లా పౌరసరఫరాలశాఖ మేనేజర్ హరికృష్ణ గురువారం తూప్రాన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.



తూప్రాన్‌లోని పౌరసరఫరాలశాఖ గోదాం

భారీగా అవకతవకలు

తూప్రాన్ గోదాంలో 4,649.82 క్వింటాళ్ల రేషన్ బియ్యం, 167.62 క్వింటాళ్ల సన్నబియ్యం (పాఠశాల), 13.14 క్వింటాళ్ల చక్కెర, 18,789 గన్నీ బ్యాగులు తక్కువగా ఉన్నట్లు గుర్తించారు. వీటి విలువ రూ. 3,74,34,571గా ఫిర్యాదులో పేర్కొన్నారు. అప్పటి సీనియర్ అసిస్టెంట్ నగేశ్‌ను బాధ్యుడిగా పేర్కొనడంతో తూప్రాన్ పోలీసులు గురువారం ఆయనను అరెస్టు చేశారు. సొమ్ము రికవరీ చేసేందుకు రెవెన్యూ రికవరీ యాక్ట్‌ను ప్రయోగించనున్నట్టు పౌరసరఫరాలశాఖ జిల్లా మేనేజర్ వివరించారు.

పది విద్యార్థుల స్నాక్స్‌కు నిధులు

● 'ఆంధ్రజ్యోతి' కథనానికి స్పందించిన సంగారెడ్డి కలెక్టర్ క్రాంతి

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

సంగారెడ్డి అర్బన్, ఫిబ్రవరి 7: పదో తరగతి విద్యార్థులకు అందించే స్నాక్స్ నిమిత్తం నిధులు మంజూరు చేస్తామని జిల్లా కలెక్టర్ క్రాంతి హామీ ఇచ్చారని డీఈవో వెంకటేశ్వర్లు ప్రకటనలో తెలిపారు. 'అర్థాకలి చదువులు.. దాతల కోసం ఎదురుచూపులు' అనే శీర్షికతో గురువారం 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనానికి కలెక్టర్ స్పందించారు. ఒక్కో విద్యార్థికి రూ.10 చొప్పున 28 రోజులకుగాను రూ.28,68,000 నిధులు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారని డీఈవో తెలిపారు. నిధులు మంజూరు చేయడంపై ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేశారు.

నేడు సదాశివపేట మున్సిపల్ ప్రత్యేక సమావేశం

● అవిశ్వాస తీర్మానంపై ఓటింగ్

● క్యాంపునకు వెళ్లిన 21 మంది కౌన్సిలర్లు

● నేరుగా ఓటింగ్‌కు హాజరయ్యే అవకాశం

సదాశివపేట, ఫిబ్రవరి 8: సదాశివపేట మున్సిపాలిటీలో అవిశ్వాస తీర్మానంపై ఓటింగ్ నిర్వహించేందుకు కలెక్టర్ ఆదేశాల మేరకు నేడు ప్రత్యేక సమావేశం నిర్వహించనున్నట్టు మున్సిపల్ కమిషనర్ జి.శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. ఉదయం 11 గంటలకు సమావేశం జరుగుతుందని, సమావేశం, ఓటింగ్ ప్రక్రియ మొత్తం వీడియో తీస్తామని చెప్పారు. సీఐ బాలస్వామి పర్యవేక్షణలో మున్సిపల్ కార్యాలయ ఆవరణలో పోలీసు బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్టు పేర్కొన్నారు. కాగా, ఎన్నికల నియామావళి ప్రకారం కోరంకు సరిపడా 18 మంది కౌన్సిలర్లు సమావేశానికి హాజరైతే ప్రిసైడింగ్ అధికారి ఓటింగ్ నిర్వహిస్తారు. ఈ నేపథ్యంలో విహారయాత్రకు వెళ్లిన 21 మంది కౌన్సిలర్ల బృందం నేరుగా సమావేశ మందిరానికి చేరుకుంటారని సమాచారం. ఇందుకోసం అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు.

కాంగ్రెస్‌లో షోకాజ్‌ల కలకలం!

● మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డి ఫిర్యాదుతో నోటీసులు

● నాయకులకు భరోసా ఇచ్చిన జిల్లా మంత్రి

ఆంధ్రజ్యోతి ప్రతినిధి, సంగారెడ్డి, ఫిబ్రవరి 8: సంగారెడ్డి నియోజకవర్గ కాంగ్రెస్‌లో షోకాజ్ నోటీసుల వ్యవహారం కలకలం రేపుతున్నది. ఇటీవల అసెంబ్లీ ఎన్నికల్లో తనకు వ్యతిరేకంగా పనిచేశారంటూ మాజీ ఎమ్మెల్యే, పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ టి.జగ్గారెడ్డి నియోజకవర్గానికి చెందిన మాజీ జడ్పీటీసీ, పోతిరెడ్డిపల్లికి చెందిన కౌన్సిలర్, పార్టీ నాయకుడొకరిపై పీసీసీ అధ్యక్షుడు, సీఎం ఎ.రేవంత్‌రెడ్డికి ఫిర్యాదు చేశారు. ఈమేరకు పీసీసీ క్రమశిక్షణ కమిటీ ముగ్గురు నాయకులకు ఇటీవల షోకాజ్ నోటీసులు అందజేసింది. ఎన్నికల్లో పార్టీ అభ్యర్థి జగ్గారెడ్డికి వ్యతిరేకంగా ఎందుకు పనిచేయాల్సి వచ్చిందో సంజాయిషీ ఇవ్వాలని నోటీసులో పేర్కొన్నది. నోటీసు అందుకున్న నాయకులు జిల్లాకు చెందిన రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహను కలిసి, తమ అభిప్రాయాలను వివరించినట్లు తెలిసింది. పార్టీ అభ్యర్థికి వ్యతిరేకంగా పనిచేయలేదని వివరణ ఇచ్చినట్టు తెలిసింది. ఇందుకు స్పందించిన మంత్రి దామోదర్ రాజనర్సింహ ఏమీ కాదులే అంటూ భరోసా ఇచ్చినట్టు కాంగ్రెస్ వర్గాలు తెలిపాయి.

'ఎంసీహెచ్' కిట్లు అయిపోయాయి..!

● సంగారెడ్డి మతాశిశు సంక్షేమ కేంద్రంలో మూడు రోజులుగా నిలిచిన పంపిణీ

● లబ్ధిదారులకు తప్పని ఎదురుచూపులు



సంగారెడ్డి అర్బన్, ఫిబ్రవరి 8: సంగారెడ్డి ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి ప్రాంగణంలోని మాతాశిశు ఆరోగ్య కేంద్రంలో ఎంసీహెచ్ కిట్ల కొరత వేధిస్తున్నది. గతంలో కేసీఆర్ కిట్ పేరిట కొనసాగిన ఈ పథకం పేరును ప్రభుత్వం మార్చి ప్రస్తుతం ఎంసీహెచ్‌కిట్‌గా అందజేస్తున్నది. ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రసవం అనంతరం బాలింతలకు ఇచ్చే ఎంసీహెచ్ కిట్ల కొరత ఏర్పడడంతో మూడురోజులుగా పంపిణీ నిలిచిపోయింది. నిబంధనల ప్రకారం ప్రసవమైన వెంటనే సదరు బాలింతకు ఎంసీహెచ్ కిట్‌ను అందజేస్తారు. రూ. 2వేల విలువైన కిట్‌లో బాలింత, శిశువుకు అవసరమయ్యే సామగ్రి ఉంటుంది. సంగారెడ్డి మాతాశిశుకేంద్రంలో ప్రతీనెల సరాసరి 700 ప్రసవాలు జరుగుతుంటాయి. ఇప్పటికే ఈ కిట్ కింద నాలుగు విడతల్లో జమ చేయాల్సిన ప్రోత్సాహక నగదు పంపిణీ మూడేళ్లుగా నిలిచిపోయింది. తాజాగా వస్తువులతో కూడిన కిట్ల సరఫరా కూడా నిలిచిపోవడంతో పథకం కొనసాగింపుపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. సంగారెడ్డి ఎంసీహెచ్ మాత్రమే కాకుండా జిల్లాలోని ఏరియా, కమ్యూనిటీ దవాఖానాలు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లోనూ ఎంసీహెచ్ కిట్లు అరకొరగానే ఉన్నట్లు సమాచారం.

నేడు ఏడుపాయలలో మాఘ అమావాస్య ఉత్సవాలు

మాఘ అమావాస్య ఉత్సవాలకు ఏడుపాయలలో ఏర్పాట్లు పూర్తయ్యాయి. మంజీరా నదిలో నేడు భక్తులు పుణ్యస్నానాలను ఆచరిస్తారు. సింగూరు జలాశయం నుంచి నీటిని దిగువకు విడుదల చేయడంతో ఘన్‌పూర్ ఆనకట్టకు చేరుకుంది. కట్ట దిగువన ఉన్న మంజీరా పాయలు జలకళను సంతరించుకున్నాయి. 7





డంప్‌యార్డు వద్దని రాస్తారోకో చేస్తున్న గ్రామస్థులు

మా ఊళ్లో డంపింగ్ యార్డ్ వద్దు

● ప్యారానగర్‌కు మహానగర చెత్త తరలిస్తే ఊరుకోం

● జాతీయ రహదారిపై గ్రామస్థుల ఆందోళన

7లో

మద్యం తాగించి, తలపై బండరాయితో మోది..

మహిళ దారుణ హత్య

7లో

కోర్కెలు తీర్చే కల్పవల్లి.. చుంచనకోట భువనేశ్వరీ

● రేపటి నుంచి శైశిరమాఘ నవరాత్రోత్సవాలు ప్రారంభం



భువనేశ్వరీ దేవీ, భువనేశ్వరీమందిరం, నారసింహీమాత(ఫైల్) , విఠాల చంద్రమౌళిశాస్త్రి(ఫైల్)

చేర్యాల, ఫిబ్రవరి 8: చేర్యాల మండలం చుంచనకోట గ్రామంలోని నారసింహీ గురుస్థానం భువనేశ్వరీ మందిరం అత్యంత మహిమాన్విత క్షేత్రంగా అలరారుతున్నది. కోరిన కోర్కెలు తీర్చుతూ భక్తుల పాలిట కల్పవల్లిగా విరాజిల్లుతున్నది. ప్రతియేటా దేవీ ఆలయాల్లో దసరా సందర్భంగా నవరాత్రోత్సవాలు జరపనుండగా, ఇక్కడ మాత్రం మాఘశుద్ధ పాడ్యమిని పురస్కరించుకుని శైశిరమాఘ నవరాత్రోత్సవాలు నిర్వహించడం, మాఘశుద్ధ ద్వాదశిన ముగించడం ఆనవాయితీగా వస్తున్నది. ఈ క్రమంలో రేపటి నుంచి ఈ నెల 21వ తేదీ వరకు 11 రోజులపాటు ఉత్సవాలు అంగరంగ వైభవంగా జరగనున్నాయి. ఈనెల 10న పూర్ణాభిషేకం, కలశ స్థాపనతో ఉత్సవాలు ప్రారంభం అవుతాయి. 14న లలితాపంచమి, డోలోత్సవం, 15న శ్రీ గురు దత్తాత్రేయ అష్టషష్ట్యుపచారపూజ, 16న చండీహవన ప్రారంభం, 18న మహన్యాసపూర్వక శతరు ద్రాభిషేకం, 20న పూర్ణాహుతి, సామూహిక సత్యనారాయణ వ్రతములు, 21న కలశోద్వాసన నిర్వహించనున్నారు. దేవీ భాగవత పారాయణం, చండీ పారాయణం, దేవీ భాగవత పురాణం, చక్రి భజనలు చేపట్టనున్నట్లు తెలిపారు. అమ్మవారి దర్శనార్థం పొరుగు ప్రాంతాల నుంచి భక్తులు నిత్యం తరలివస్తూనే ఉంటారు. విదేశాల్లో స్థిరపడిన భక్తులు స్వదేశానికి రావడంతోనే అమ్మవారిని దర్శించుకుంటారు. భక్తులకు ఇబ్బందులు కలుగకుండా ఏర్పాట్లు చేసినట్టు నిర్వాహకులు తెలిపారు.

జర్నలిస్టుల సమస్యలను పరిష్కరించాలి

● టీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు మామిడి సోమయ్య



సమావేశంలో మాట్లాడుతున్న సోమయ్య

హుస్నాబాద్, ఫిబ్రవరి 8: జర్నలిస్టుల సమస్యలను గత బీఆర్ఎస్ ప్రభుత్వం పూర్తిగా విస్మరించిందని, కాంగ్రెస్ ప్రభుత్వం అయినా త్వరితగతిన పరిష్కరించాలని టీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు మామిడి సోమయ్య కోరారు. గురువారం ఆయన హుస్నాబాద్ పట్టణంలో జరిగిన టీడబ్ల్యూజేఎఫ్ జిల్లా మహాసభలో మాట్లాడారు. తెలంగాణ ఉద్యమంలో కీలకపాత్ర పోషించిన జర్నలిస్టులను గౌరవించి ఆదుకోవాల్సిన పాలకులు విస్మరించడం సరైంది కాదన్నారు. జర్నలిస్టులకు ఇళ్లస్థలాలు, ఉద్యోగ, ఆరోగ్య భద్రత, పెన్షన్ స్కీం, హెల్త్ స్కీం, ప్రత్యేక రక్షణ చట్టం వంటి డిమాండ్ల సాధన కోసం నిరంతరం పోరాటాలు చేస్తామన్నారు. ఈ సమావేశంలో మున్సిపల్ చైర్‌పర్సన్ ఆకుల రజిత, వైస్ చైర్‌పర్సన్ అనిత, ఐఎఫ్‌డబ్ల్యూజే కార్యదర్శి పి.ఆనందం, రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాస్, రాజలింగం, బాపురావు, అడహక్ కమిటీ కన్వీనర్ మురళీధర్‌స్వామి, కోకన్వీనర్ ఎల్లయ్య, యూసుఫ్ పాల్గొన్నారు. అనంతరం సంఘ జిల్లా కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా వరిమురళీధరస్వామి, కార్యదర్శిగా ఎల్లయ్య, ఉపాధ్యక్షులుగా సంపత్, సహాయ కార్యదర్శిగా రాజమల్లు, కార్యవర్గ సభ్యులుగా ఖుద్రత్‌అలీ, రాజు, రాజలింగం ఎన్నికయ్యారు.

'పది'లో ఉత్తమ ఫలితాలను సాధించాలి

● సిద్దిపేట అదనపు కలెక్టర్ గరిమా అగ్రవాల్

● జడ్పీహెచ్ఎస్ ఆకస్మిక తనిఖీ



పెద్దచీకోడ్‌లో ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులతో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ గరిమా అగ్రవాల్

దుబ్బాక, ఫిబ్రవరి 8: రానున్న పదో తరగతి వార్షిక పరిక్షల్లో విద్యార్థులు ఉత్తమ ఫలితాలను సాధించే విధంగా ఉపాధ్యాయులు విద్యాబోధన చేయాలని సిద్దిపేట అదనపు కలెక్టర్ గరిమా అగ్రవాల్ సూచించారు. గురువారం దుబ్బాక మండలం పెద్దచీకోడ్ గ్రామంలో జడ్పీహెచ్ఎస్ పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేసి రికార్డులను, గ్రామంలో జరుగుతున్న పారిశుధ్య పనులను పరిశీలించారు. గ్రామంలోని సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం దుబ్బాక ఐవోసీ కార్యాలయంలో ఓటరు ముసాయిదా జాబితా సమావేశాన్ని నిర్వహించారు. దుబ్బాక నియోజవర్గంలో లక్షా 99 వేల 236 మంది ఓటర్లు ఉన్నారన్నారు. అందులో పురుష ఓటర్లు 96 వేల 866, మహిళా ఓటర్లు లక్షా 2 వేల 370 మంది ఓటర్లు ఉన్నారని తెలిపారు.

మర్పడగ మల్లికార్జునుడికి అన్నాభిషేకం

కొండపాక, ఫిబ్రవరి 8: కొండపాక మండలం మర్పడగ గ్రామంలోని విజయదుర్గా సమేత సంతాన మల్లికార్జునస్వామి క్షేత్రంలో గురువారం మాసశివరాత్రి సందర్భంగా స్వామివారికి అన్నాభిషేకం భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. క్షేత్రం నిర్వాహకులు డాక్టర్ చెప్పెల హరినాథ శర్మ ఆధ్వర్యంలో ఉదయం 6.30 గంటలకు గణపతి పూజతో కార్యక్రమం ప్రారంభం కాగా.. విజయదుర్గా మాతకు, సంతాన మల్లికార్జునస్వామికి పూజలు నిర్వహించారు. అనంతరం ఉదయం 10 నుంచి 1 గంటల వరకు లఘున్యాస పూర్వకంగా విశేష పంచామృత ఫలరస అభిషేకం నిర్వహించి అన్నపూజ చేశారు. ఈ కార్యక్రమంలో క్షేత్ర నిర్వహణ కమిటీ సభ్యులు గట్టు విఠల్, బాలరాజేశం, మర్యాల రవీందర్, లగిశెట్టి రాజు, తిరుపతిరెడ్డి పాల్గొన్నారు.

అనుమానాస్పద వ్యక్తి బైండోవర్

సిద్దిపేట క్రైం, ఫిబ్రవరి 8: సిద్దిపేట పట్టణం నర్సాపూర్ పరిధిలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలకు గురువారం ఓ వ్యక్తి మద్యం మత్తులో వెళ్లి రెండో తరగతి విద్యార్థి బాబాయి అని ఉపాధ్యాయులకు చెప్పి తీసుకెళ్లే ప్రయత్నం చేశాడు. అనుమానం వచ్చిన ఉపాధ్యాయులు విద్యార్థి తల్లికి ఫోన్ చేయగా.. అతనెవరో తెలియదని, బాబును పంపొద్దని చెప్పింది. దీంతో పాఠశాల సిబ్బంది డయల్ 100కు ఫోన్‌చేశారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు సదరు వ్యక్తిని విచారించగా.. పొంతనలేని సమాధానం చెబుతూ న్యూసెన్స్ చేయగా.. తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేశారు. ఈ సంఘటన సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. పాఠశాలకు వచ్చిన వ్యక్తి కిడ్నాపర్ కాదని, విద్యార్థి తల్లిదండ్రులకు పరిచయం ఉన్నవాడని, మద్యం సేవించి న్యూసెన్స్ చేయడం వల్లే బైండోవర్ చేశామని తెలిపారు.

నేడే ఏడుపాయలలో మాఘ అమావాస్య ఉత్సవాలు

● మాఘస్నానాలకు ఏర్పాట్లు పూర్తి

పాపన్నపేట, ఫిబ్రవరి 8: మాఘ అమావాస్యను పురస్కరించుకొని ఏడుపాయల్లో ఉత్సవాలకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. మంజీరా నదిలో పుణ్యస్నానాలు ఆచరించి.. ఇక్కడి అమ్మవారిని దర్శించుకునేందుకు రాష్ట్రం నుంచే కాకుండా వివిధ రాష్ట్రాల నుంచి సుమారు లక్ష మందికి పైగా భక్తులు వచ్చే అవకాశం ఉన్నట్లు దేవాదాయ శాఖ, పాలక మండలి సభ్యులు అంచనా వేస్తున్నారు. ఇందుకు అనుగుణంగా ఏర్పాట్లు చేస్తున్నారు. ఆలయ పరిసరాల్లోని నది పాయల వద్ద భక్తులు పుణ్యస్నానాలు ఆచరించడానికి మొత్తం ఏడు చోట్ల షవర్లను ఏర్పాటు చేశారు. మహిళలు దుస్తులు మార్చుకునేందుకు తాత్కాలిక టెంట్లను వేశారు. అమ్మవారి దర్శనం కోసం చలువ పందిళ్లు వేసి.. ప్రత్యేక క్యూలు ఏర్పాటు చేశారు. రాత్రి అమ్మవారి ఆలయ సన్నిధిలో బస చేసే భక్తుల సౌకర్యార్థం విద్యుద్దీపాలను ఏర్పాటు చేశారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చే భక్తుల కోసం పార్కింగ్ స్థలాలను కేటాయించారు. పాపన్నపేట వైపు నుంచి వచ్చే వాహనాలు చెలిమెకుంట వద్ద, పోతన్‌శెట్టిపల్లి వైపు నుంచి వచ్చే వాహనాలు టేకులగడ్డ వద్ద పార్కింగ్ ఏర్పాట్లు చేశారు. భక్తుల సౌకర్యార్థం మెదక్ డిపో నుంచి ఆర్టీసీ ప్రత్యేక బస్సులు నడుపుతోంది.



ఆలయానికి వెళ్లే మార్గంలో ప్రత్యేక క్యూ

సౌకర్యాలు కరువు..

పుణ్యస్నానాల కోసం ఏర్పాటు చేసిన షవర్ల వద్ద ఇంకా పిచ్చి మొక్కలు దర్శనం ఇస్తున్నాయి. చెక్‌డ్యాంకు వెళ్లే మార్గం అంతా చెత్తాచెదారంతో గుంతలమయంగా మారింది. దీంతో పుణ్యస్నానాలకు వచ్చే భక్తులు ఇబ్బంది పడే అవకాశం ఉంది.



చెక్‌డ్యాం వద్ద గుంతలమయంగా ఉన్న దారి

పాయాలకు జలకళ

యాసంగి పంటల కోసం సింగూరు జలాశయం నుంచి ఈనెల 6న 350 ఎంటీఎఫ్‌టీల నీటిని దిగువకు విడుదల చేశారు. ఆ నీరు గురువారం ఘన్‌పూర్ ఆనకట్టలోకి చేరుకుంది. దీంతో ఆనకట్ట నిండుకుండలా మారింది. ఆనకట్ట దిగువన ఉన్న ఏడుపాయల్లోకి భక్తులు పుణ్యస్నానాలు ఆచరించడానికి ప్రాజెక్టు నుంచి నదీ పాయలకు విడుదల చేశారు. దీంతో పాయలన్నీ జలకళ సంతరించుకున్నాయి.

భారీ బందోబస్తు

మాఘ అమావాస్య సందర్భంగా భారీ ఎత్తున భక్తులు తరలిరానున్న నేపథ్యంలో జిల్లా ఎస్పీ బాలస్వామి ఆదేశాల మేరకు మెదక్ డీఎస్పీ ఫణిందర్ ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ మేరకు పాపన్నపేట, మెదక్, కొల్చారం ఎస్‌ఐలతోపాటు బందోబస్తులో పాల్గొనే సిబ్బందితో గురువారం డీఎస్పీ సమావేశమై పలు సూచనలు చేశారు. వైద్యశాఖ ఆధ్వర్యంలో వైద్య సిబ్బందితో పాటు ఒక అంబులెన్స్‌ను ఏర్పాటు చేశారు. 20 మంది గజ ఈతగాళ్లను నియమించినట్లు మత్స్యశాఖ అధికారులు తెలిపారు.

ఏర్పాట్లు పూర్తి..

మాఘ అమావాస్య ఉత్సవాల సందర్భంగా అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు చైర్మన్ బాలాగౌడ్, ఈవో మోహన్‌రెడ్డిలు పేర్కొన్నారు. కేటాయించిన స్థలాల వద్దనే మాఘ స్నానాలు చేయాలన్నారు. భక్తులు పోలీసు, దేవాదాయ శాఖ అధికారుల సూచనలు పాటించాలని పేర్కొన్నారు. చైర్మన్, ఈవో, డైరెక్టర్‌లతో ఏర్పాట్లను పర్యవేక్షించారు.

మహిళ దారుణ హత్య

● మద్యం తాగించి, తలపై బండరాయితో మోది ..



సునీత (ఫైల్)

హత్నూర, ఫిబ్రవరి 8: వివాహేతర సంబంధం ఓ నిండు ప్రాణాన్ని బలి తీసుకుంది. మహిళతో సన్నిహితంగా ఉన్న వ్యక్తి ఆమె తలపై బండరాయితో మోది హత్య చేశాడు. ఒంటిపై పెట్రోల్ పోసి తగలపెట్టడంతో పాటు.. సగం కాలిన మృతదేహాన్ని పక్కనే నీటి గుంతలో పడేసి.. పైకి తేలకుండా బండరాళ్లు పెట్టిన ఘటన హత్నూర పోలీస్‌స్టేషన్ పరిధిలోని మాధుర గ్రామ శివారులో గురువారం వెలుగు చూసింది. పోలీసులు, కుటుంబీకుల కథనం ప్రకారం.. హత్నూర మండల పరిధిలోని గోవింద్‌రాజ్‌పల్లి గ్రామానికి చెందిన వడ్డే సునీత (35) పదేళ్ల క్రితం భర్త నుంచి విడిపోయి, తల్లిగారి గ్రామమైన గోవిందరాజ్‌పల్లిలో ఇద్దరు కుమారులతో కలిసి ఉంటోంది. గుమ్మడిదల, దౌల్తాబాద్, సంగారెడ్డి ప్రాంతాలలో అడ్డకూలిగా పని చేస్తుంది. రోజువారీ మాదిరిగానే జనవరి 31న ఉదయం పని కోసమని వెళ్లింది. రాత్రి అయినా తిరిగి రాకపోవడంతో కుటుంబీకులు బంధువుల వద్ద వెతికినా.. ఆచూకీ లభించలేదు. దీంతో ఈనెల 5న హత్నూర పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. వెంటనే స్పందించిన పోలీసులు మృతురాలు సెల్‌ఫోన్ కాల్‌లిస్ట్ ఆధారంగా ముగ్గురు అనుమానితులను అదుపులోకి తీసుకొని విచారించారు. మాధుర గ్రామానికి చెందిన మాదిగ దత్తయ్యను విచారించగా, చేసిన నేరాన్ని ఒప్పుకున్నట్లు పోలీసులు తెలిపారు. జనవరి 31న మృతురాలు సునీత, దత్తయ్యలు గ్రామ శివారులో గల దత్తాత్రేయ గుట్ట సమీపంలోని బండ పొదల్లో మద్యం సేవించి ఏకాంతంగా గడిపారు. తర్వాత ఇద్దరి మధ్య డబ్బుల విషయంలో మాటామాట పెరగడంతో కోపోద్రిక్తుడైన దత్తయ్య.. సునీత తలపై బండరాయితో మోదడంతో ఆమె అక్కడికక్కడే చనిపోయింది. దీంతో దత్తయ్య వెంటనే ఓ పెట్రోల్ బంక్‌కు వెళ్లి.. పెట్రోల్ తీసుకొచ్చి మృతురాలి ఒంటిపై పోసి నిప్పంటించాడు. పూర్తిగా కాలకపోవడంతో సమీపంలోని నీటి గుంతలో వేసి పైకి కనపడకుండా.. మృతదేహంపై రాళ్లు పెట్టి, పరారైనట్లు పోలీసులు తెలిపారు. నిందితుడు ఇచ్చిన సమాచారంతో పోలీసులు నీటిగుంతలోని మృతదేహాన్ని గురువారం వెలికి తీసి, అక్కడే పోస్టుమార్టం నిర్వహించారు. మృతురాలి సోదరుడు హనుమంతు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. సంఘటన స్థలంలో పలు ఆధారాలు సేకరించినట్లు జిన్నారం సీఐ సుధీర్‌కుమార్, ఎస్‌ఐ సుభాష్‌లు తెలిపారు.

శిక్షణ విమానం కూలినచోట స్మృతి చిహ్నం

తూప్రాన్, ఫిబ్రవరి 8: శిక్షణ విమానం కూలి ఇద్దరు మరణించిన ప్రదేశంలో తన కుమారుడి జ్ఞాపకార్థం తల్లి స్మృతి చిహ్నం నిర్మించారు. మెదక్ జిల్లా తూప్రాన్ పట్టణ పరిధి రావెల్లి శివారు టాటాకాఫీ కంపెనీ వద్ద గతేడాది డిసెంబరు 4న దుండిగల్ ఎయిర్‌ఫోర్స్‌కు చెందిన శిక్షణ విమానం కూలింది. ఈ ప్రమాదంలో ఇన్‌స్ట్రక్టర్ (పైలట్) అభిమన్యురాయ్, శిక్షణ పొందుతున్న వియత్నాంకు చెందిన ఫువన్‌ట్రైన్ మృతి చెందారు. ఆ ప్రదేశంలో అభిమన్యురాయ్ తల్లి చంద్రలేఖారాయ్ స్మృతిచిహ్నం ఏర్పాటు చేయాలని భావించారు. రెవెన్యూ అధికారుల సహాయంతో శిక్షణ విమానం కూలిన ప్రదేశానికి సమీపంలో స్మృతి చిహ్నం నిర్మించారు.



రావెల్లిశివారులో విమానం కూలిన చోట ఏర్పాటు చేసిన స్మృతి చిహ్నం

దోషం చెరువు కబ్జాకు యత్నం

● రాత్రికి రాత్రే ప్రహరీ నిర్మాణం

● అక్రమార్కులకు నాయకుల అండ

పటాన్‌చెరు, ఫిబ్రవరి 8: సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు డివిజన్ పరిధిలోని బండ్లగూడలో దోషం చెరువు స్థలాన్ని ఆక్రమించేందుకు కొందరు యత్నించారు. రాత్రికి రాత్రే సుమారు రెండెకరాల ఎఫ్‌టీఎల్ స్థలం చుట్టూ ప్రహరీని నిర్మించి స్థలాన్ని స్వాధీనం చేసుకునేందుకు ప్రయత్నించారు. విషయం తెలియడంతో గురువారం అధికారులు అక్కడకు చేరుకుని ప్రహరీని కూల్చివేశారు. గతంలో కూడా దోషం చెరువు ఎఫ్‌టీఎల్‌లో తమకు భూములు ఉన్నాయని కొందరు వ్యక్తులు పెద్దఎత్తున మట్టిని నింపడంతో అప్పట్లో తీవ్ర విమర్శలు వచ్చాయి. దీంతో కబ్జాదారులు వెనక్కు తగ్గారు. తిరిగి కొందరు స్థానిక నాయకుల ప్రోద్బలం, వెన్నుదన్నుతో బుధవారం రాత్రి ఎఫ్‌టీఎల్ స్థలం చుట్టూ ప్రహరీని నిర్మించి ఆక్రమించేందుకు ప్రయత్నం చేయడంతో దుమారం రేగింది. స్థానిక కార్పొరేటర్ మెట్టు కుమార్‌యాదవ్ జీహెచ్‌ఎంసీ జోనల్ కమిషనర్ స్నేహాషబరీష్‌కు ఫిర్యాదు చేశారు. జోనల్ కమిషనర్ ఆదేశాలతో జీహెచ్‌ఎంసీ అధికారులు, సిబ్బంది ఆఘమేఘాల మీద గురువారం చెరువు ఆక్రమణలపై స్పందించారు. జీహెచ్‌ఎంసీ ఇరిగేషన్ డీఈ నళిని, ఏఈ పావని, సర్కిల్ డిప్యూటీ కమిషనర్ సురేష్, టౌన్‌ప్లానింగ్ ఏసీపీ శ్రీహరి చెరువు వద్దకు చేరుకున్నారు.



చెరువు స్థలంలో నిర్మించిన ప్రహరీని కూల్చివేస్తున్న జీహెచ్‌ఎంసీ సిబ్బంది

ఎఫ్‌టీఎల్ స్థలంలో నిర్మించిన నిర్మించిన ప్రహరీని కూల్చివేశారు. ఈ సందర్భంగా జోనల్ కమిషనర్ సురేష్, కార్పొరేటర్ మెట్టు కుమార్ మాట్లాడుతూ.. చెరువులను కబ్జా చేస్తే సహించేది లేదని, నిందితులపై క్రిమినల్ కేసులను నమోదు చేయిస్తామని హెచ్చరించారు.

చెరువు తూములో పడి ఒకరి మృతి



మల్లేశం (ఫైల్)

పుల్‌కల్, ఫిబ్రవరి 8: ప్రమాదవశాత్తు చెరువు తూములో పడి ఒకరు మృతి చెందిన సంఘటన చౌటకూర్ మండలం సుల్తాన్‌పూర్ గ్రామశివారులో గురువారం సాయంత్రం జరిగింది. ఉప్పరిగూడెం గ్రామానికి చెందిన వడ్ల మల్లేశం (46) పని నిమిత్తం సల్తాన్‌పూర్ గ్రామానికి వచ్చి, తిరుగు ప్రయాణంలో ఉప్పరిగూడెం వెళ్తున్నారు. దారిలో మల్లేశం సుల్తాన్‌పూర్ గ్రామ శివారులోని పెద్ద చెరువు మైసమ్మ దేవాలయం వద్ద ఉన్న తూము కల్వర్టుపై నిద్రకు ఉపక్రమించాడు. నిద్రలో ప్రమాదవశాత్తు ఉధృతంగా ప్రవహిస్తున్న ఆ తూము నీటిలోనే పడి ఊపిరాడక మృత్యువాత పడ్డాడు. గమనించిన స్థానికులు సంఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించగా, అప్పటికే మల్లేశం మృతి చెందారు. పుల్కల్ పోలీసులకు సమాచారం అందించగా, వారు వచ్చి మృతదేహాన్ని బయటకు తీశారు. పుల్కల్ ఎస్‌ఐ పాటిల్ క్రాంతికుమార్ కేసు దర్యాప్తు చేస్తున్నారు. మృతుడికి భార్య గోవిందమ్మ, ఒక కూతురు, కుమారుడు ఉన్నారు. మృతుడి కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని తాజా మాజీ సర్పంచ్ అల్వాల రేణుకనర్సింలు, కాంగ్రెస్ నాయకుడు కలాలి ఈశ్వర్‌గౌడ్‌లు కోరారు.

రాష్ట్రస్థాయి వైజ్ఞానిక ప్రదర్శనలో ద్వితీయ స్థానం

మెదక్ అర్బన్, ఫిబ్రవరి 8: రాష్ట్రస్థాయి వైజ్ఞానిక ప్రదర్శనలో బంజారానగర్ జడ్పీహెచ్‌ఎస్ విద్యార్థిని కల్పన ద్వితీయ స్థానంలో నిలిచిందని జిల్లా సైన్స్ అధికారి రాజిరెడ్డి గురువారం తెలిపారు. గైడ్ టీచర్ ప్రసన్నకుమార్ ఆధ్వర్యంలో కల్పన సుస్థిర వ్యవసాయం ఉప అంశంలో మల్టీపర్పస్ సోలార్ కిసాన్ రక్షక్ అగ్రికల్చర్ సిస్టం అనే ప్రాజెక్టును రూపొందించింది. రాష్ట్రస్థాయి ప్రదర్శనలో వర్చువల్ పద్ధతిలో పాల్గొని ద్వితీయ స్థానంలో నిలిచింది. కల్పనను జిల్లా కలెక్టర్ రాజర్షిషా, డీఈవో రాధాకిషన్ అభినందించారు.



తాను రూపొందించిన ప్రాజెక్టుతో విద్యార్థిని కల్పన

నవోదయ ప్రవేశ పరీక్షకు ఏర్పాట్లు పూర్తి

● ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 7 పరీక్షా కేంద్రాలు

● హాజరుకానున్న 2,161 మంది విద్యార్థులు

వర్గల్, ఫిబ్రవరి 8: జవహర్ నవోదయ విద్యాలయంలో 2024-2025 విద్యా సంవత్సరంలో 9, 11 తరగతిలోని సీట్ల భర్తీ కోసం ఈ నెల 10న ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నారు. అందుకు సంబంధించిన ఏర్పాట్లు పూర్తయినట్లు నవోదయ విద్యాలయ ప్రిన్సిపాల్ రాజేందర్ తెలిపారు. గురువారం పరీక్ష నిర్వహణకు సంబంధించి పవర్ పాయింట్ ద్వారా పరీక్ష కేంద్రాల సూపరిటెండెంట్లకు, కేంద్ర పరిశీలకులకు శిక్షణ ఇచ్చారు. ఉమ్మడి మెదక్ జిల్లా వ్యాప్తంగా 9వ తరగతిలో ప్రవేశానికి 1,109 మంది, 11వ తరగతిలో ప్రవేశానికి 1,052 మంది విద్యార్థులు పరీక్ష రాయనున్నారని తెలిపారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 7 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. 9వ తరగతి ప్రవేశ పరీక్షకు 4 కేంద్రాలు, 11వ తరగతి ప్రవేశ పరీక్షకు 3 కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. ప్రవేశ పరీక్ష గజ్వేల్, ప్రజ్ఞాపూర్‌తో పాటు వర్గల్ జవహర్ నవోదయ విద్యాలయంలో నిర్వహించడం జరుగుతుందన్నారు. 9వ తరగతి ప్రవేశ పరీక్ష ఉదయం ఉదయం 11.15 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు, 11వ తరగతి ప్రవేశ పరీక్ష ఉదయం 11.00 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు నిర్వహిస్తామన్నారు.



సమావేశంలో పాల్గొన్న సూపరింటెండెంట్లు, కేంద్ర పరిశీలకులు

పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్

సిద్దిపేట క్రైం, ఫిబ్రవరి 8 : ఈ నెల 10న నిర్వహించే జవహర్ నవోదయ విద్యాలయ ప్రవేశ పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుందని పోలీస్ కమిషనర్ బి.అనురాధ తెలిపారు. పరీక్ష సమయంలో పరీక్ష కేంద్రాల నుంచి 500 మీటర్ల వరకు ప్రజలు గుమిగూడ వద్దని, సమీపంలో ఉన్న జిరాక్స్ సెంటర్లు మూసివేయాలని సూచించారు.

వృద్ధుడి ఆత్మహత్య

రామాయంపేట, ఫిబ్రవరి 8: ఒంటరితనానికి తోడు అనారోగ్యంతో బాధపడుతూ ఓ వృద్ధుడు ఆత్మహత్యకు ఒడిగట్టాడు. రామాయంపేట మండల పరిధి ఝాన్సీలింగాపూర్‌కు చెందిన కర్రె చంద్రయ్య (68) భార్య, కొడుకు కొన్నాళ్ల క్రితమే చనిపోయారు. దీంతో కోడలి వద్ద ఉంటున్నాడు. తరచూ అనారోగ్యానికి గురి కావడం, ఒంటరితనంతో మనస్తాపానికి గురయ్యాడు. బుధవారం రాత్రి ఇంట్లో ఎవరూ లేని సమయంలో దూలానికి తాడుతో ఉరి వేసుకున్నట్లు ఎస్‌ఐ రంజిత్ తెలిపారు.

గుర్తుతెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి

రాయపోల్, ఫిబ్రవరి 8: గుర్తుతెలియని వాహనం ఢీకొని బైక్‌పై వెళ్తున్న వ్యక్తి మృతి చెందాడు. మెదక్ జిల్లా నర్సంపల్లి గ్రామానికి చెందిన ఉడుత దశరథం(36) బుధవారం దౌల్తాబాద్‌లోని బంధువుల ఇంటికి వచ్చాడు. ఆయన భార్య చేగుంట మండలం బోనాలలోని పుట్టింటి వద్ద ఉండడంతో రాత్రి బైక్‌పై దౌల్తాబాద్ నుంచి బోనాలకు బయలుదేరాడు. ఈ క్రమంలో గోవిందాపూర్ సమీపంలో గుర్తు తెలియని వాహనం దశరథం బైక్‌ను ఢీకొట్టడంతో తీవ్రంగా గాయపడ్డాడు. అతడిని హైదరాబాద్‌లోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా.. చికిత్స పొందుతూ గురువారం తెల్లవారుజామున మృతిచెందాడు. మృతుని భార్య లత ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు స్టేషన్ హౌజ్ ఆఫీసర్ సాయిలు తెలిపారు.

జాతీయ స్థాయి రగ్బీ పోటీలకు ఖేడ్ విద్యార్థులు



జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులు

నారాయణఖేడ్, ఫిబ్రవరి 8: జాతీయ స్థాయి రగ్బీ పోటీలకు నారాయణఖేడ్‌లోని ఈ-తక్షిల పాఠశాల విద్యార్థులు ఎంపికయ్యారని కరస్పాండెంట్ శరత్ గురువారం ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర స్థాయిలో అండర్ -14 విభాగంలో నిర్వహించిన రగ్బీ పోటీల్లో విద్యార్థులు శ్రీరాం, విలక్షణ, సాయి లక్ష్మీ ప్రతిభను కనబరిచి గుజరాత్‌లో జరుగనున్న జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు. రగ్బీ అసోసియేషన్ సెక్రెటరీ కిష్టయ్య, అధ్యక్షుడు మారుతి, శ్రీనాథ్, తదితరులు విద్యార్థులను అభినందించారు.

సహకార బ్యాంకు టర్నోవర్ రూ.2,500కోట్లు

●డీసీసీబీ చైర్మన్ చిట్టి దేవేందర్‌రెడ్డి, ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి

జగదేవ్‌పూర్, ఫిబ్రవరి 8: దశాబ్ద కాలం క్రితం సహకార బ్యాంకు టర్నోవర్ రూ.రెండు కోట్లుగా ఉండేదని, ప్రస్తుతం రూ.2,500కోట్ల టర్నోవర్‌కు చేరుకుందని ఉమ్మడి మెదక్ జిల్లా డీసీసీబీ చైర్మన్ చిట్టి దేవేందర్‌రెడ్డి, ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి అన్నారు. గురువారం జగదేవ్‌పూర్ మండల కేంద్రంలోని పీఏసీఎస్ కార్యాలయంలో సీఎస్‌సీ (కామన్ సర్వీస్ సెంటర్), అలిరాజపేటలో దుకాణాల సముదాయాలను వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా చిట్టి దేవేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. పీఏసీఎస్ సేవలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. సొసైటీల ద్వారా రైతులకు ఎరువులు అందిస్తున్నామన్నారు. వంటేరు ప్రతాప్‌రెడ్డి మాట్లాడుతూ.. రైతులకు వెన్నుదన్నుగా నిలిచింది మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ అని కొనియాడారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ ఇంద్రసేనారెడ్డి, ఎంపీపీ బాలేశంగౌడ్, జడ్పీటీసీ సుధాకర్‌రెడ్డి, కిరణ్‌గౌడ్, కావ్య దర్గయ్య, కవితా శ్రీనివాస్‌రెడ్డి, రంగారెడ్డి, యాదవరెడ్డి, ఉపేందర్‌రెడ్డి, పీఏసీఎస్ డైరెక్టర్లు శ్రీనివాస్‌గౌడ్, గుర్రం శ్రీనివాస్, పబ్బా శ్రీహరిగౌడ్, శివలింగం తదితరులు పాల్గొన్నారు.



కామన్ సర్వీస్ సెంటర్‌ను ప్రారంభిస్తున్న చిట్టి దేవేందర్‌రెడ్డి, ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి

తల్లి, కూతురు అదృశ్యం



అదృశ్యమైన లావణ్య, లాహిత్య

టేక్మాల్, ఫిబ్రవరి 8: తల్లి, కూతురు అదృశ్యమైన సంఘటన మండలంలోని అచ్చనపల్లి గ్రామంలో జరిగింది. అచ్చనపల్లిలోని తల్లిగారింటికి వెళ్లిన కడల లావణ్య(27) సోమవారం మధ్యాహ్నం అత్తగారి ఊరైన చిన్నఘనపూర్‌కు తన కూతురు లాహిత్యతో కలిసి బయలుదేరి వెళ్లింది. మంగళవారం ఉదయం లావణ్య భర్త మల్లేష్‌కు ఆమె అన్న మల్లేశం ఫోన్ చేసి అడుగగా ఇద్దరూ రాలేదని చెప్పాడు. బంధువులు, స్నేహితులను వాకబు చేసినా ఆమె జాడ తెలియలేదు. అన్న మల్లేశం గురువారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ రమేష్ తెలిపారు.

బోనాల కొండాపూర్‌లో వృద్ధురాలు



మల్లవ్వ (ఫైల్)

చేగుంట, ఫిబ్రవరి 8: వృద్ధురాలు అదృశ్యమైన ఆరు సంవత్సరాల తర్వాత పోలీసులకు ఫిర్యాదు చేశారు. బోనాల కొండాపూర్ గ్రామానికి చెందిన కారింగుల చిన్న మల్లవ్వ(68) ఆరు సంవత్సరాల క్రితం ఇంట్లో నుంచి వెళ్లిపోయి నేటికీ తిరిగిరాలేదు. ఆమె ఆచూకీ తెలిసిన వారు చేగుంట పోలీస్‌స్టేషన్‌కు సమాచారం ఇవ్వాలని ఎస్‌ఐ హరీశ్ గౌడ్ తెలిపారు. ఆచూకీ తెలిసిన వారు చేగుంట ఎస్‌ఐ 8712657936, చేగుంట పోలీస్ స్టేషన్ 8712657893 నంబర్లకు తెలియజేయాలని కోరారు.

ఉద్యోగ భద్రత కల్పించండి

● అతిథి అధ్యాపకుల డిమాండ్

సంగారెడ్డి రూరల్, ఫిబ్రవరి 8: తమకు ఉద్యోగ భద్రత కల్పించాలని ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో విధులు నిర్వహిస్తున్న అతిథి అధ్యాపకులు డిమాండ్ చేశారు. సంగారెడ్డిలోని ఐబీలో గురువారం నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. గత ప్రభుత్వ హయాంలో చాలీచాలని వేతనాలతోనే పనిచేశామన్నారు. ఇతర అధ్యాపకుల మాదిరిగానే తాము విధులు నిర్వహించినా న్యాయం జరుగలేదని వాపోయారు. కాంగ్రెస్ ప్రభుత్వంలోనైనా తమకు హైకోర్టు ఉత్తర్వులను అమలు చేసి ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. సమావేశంలో యూనియన్ రాష్ట్ర కమిటీ సభ్యుడు శ్రీశైలం, సిద్దిపేట, సంగారెడ్డి జిల్లాల అధ్యక్షులు సాయిబాబా, కాసోజు రమేష్ చారి, కార్యదర్శి వెంకటేశ్వర్లు, కోశాధికారి వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

చట్టసభల్లో బీసీలకు 50 శాతం రిజర్వేషన్లు కల్పించాలి

● రజక సంఘం జిల్లా అధ్యక్షుడు నాగేష్ డిమాండ్



సమావేశంలో మాట్లాడుతున్న రజక సంఘం జిల్లా అధ్యక్షుడు నాగేష్

సంగారెడ్డి రూరల్, ఫిబ్రవరి 8: చట్టసభల్లో బీసీలకు 50 శాతం రిజర్వేషన్లు కల్పించాలని రజక సంఘం సంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు నాగేష్ డిమాండ్ చేశారు. సంగారెడ్డి పట్టణంలో గురువారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో అన్ని రాజకీయ పార్టీలు రాష్ట్రంలో బీసీలకు 9 సీట్లు కేటాయించాలని కోరారు. తెలంగాణ కోసం తన ప్రాణాలను కూడా లెక్కచేయకుండా పోరాడిన బీరయ్యయాదవ్‌కు మెదక్ పార్లమెంట్ టికెట్‌ను బీఆర్‌ఎస్ కేటాయించాలని కోరారు. ఆయనకు రజక సంఘం సంపూర్ణ మద్దతు ఇస్తున్నట్ల తీర్మానం చేశారు. బీఆర్‌ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ మెదక్ ఎంపీ టికెట్‌ను బీరయ్యయాదవ్‌కు ఇస్తే ఆయన విజయానికి సంఘం తరఫున కృషి చేస్తామని తెలిపారు. సమావేశంలో సంఘం జిల్లా సలహాదారు నర్సింలు, నాయకులు రాజు, సాయి, దేవా, శ్రీనివాస్, రాములు, అంతమ్మ తదితరులు పాల్గొన్నారు.

చట్టాలను పకడ్బందీగా అమలు చేయాలి



గర్ల్స్ కన్వెన్షన్‌లో మాట్లాడుతున్న ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి మమత

సంగారెడ్డి రూరల్, ఫిబ్రవరి 8: బాలికలు, మహిళల భద్రత కోసం మహిళా చట్టాలను పకడ్బందీగా అమలు చేయాలని ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి మమత డిమాండ్ చేశారు. సంగారెడ్డిలోని రాయల్ జూనియర్ కళాశాలలో గురువారం నిర్వహించిన గర్ల్స్ కన్వెన్షన్‌లో ఆమె మాట్లాడారు. మహిళా అభ్యున్నతి కోసం ఎస్‌ఎఫ్‌ఐ అనేక పోరాటాలు చేస్తున్నదన్నారు. విద్యార్థినులు విద్యారంగంతో పాటు రాజకీయాల్లోనూ రాణించాలన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం మహిళలను ఆటవస్తువులా చిన్నచూపు చూస్తున్నదని ఆవేదన వ్యక్తం చేశారు. మహిళలు సావిత్రీబాయిని స్ఫూర్తిగా తీసుకుని ప్రగతిశీల ఆలోచనలతో అన్ని రంగాల్లో ముందుండాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి రమేష్, నాయకులు రవి, కిరణ్ గౌడ్ పాల్గొన్నారు.

బొల్లారంలో బాల్క సుమన్ దిష్టిబొమ్మ దహనం

జిన్నారం, ఫిబ్రవరి 8: సీఎం రేవంత్‌రెడ్డిపై బీఆర్‌ఎస్ మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ అనుచిత వ్యాఖ్యలకు నిరసనగా బొల్లారం మున్సిపాలిటీలో గురువారం కాంగ్రెస్ నాయకులు దిష్టిబొమ్మను దహనం చేశారు. కాంగ్రెస్ పార్టీ కౌన్సిలర్ చంద్రారెడ్డి, పార్టీ పట్టణ అధ్యక్షుడు జైపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో బాల్క సుమన్ దిష్టిబొమ్మను ఊరేగించి, దహనం చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్లు గోపాలమ్మ, చంద్రయ్య, నాయకులు వరప్రసాద్‌రెడ్డి, రాజ్‌గోపాల్, శ్రీకాంత్‌రెడ్డి, చంద్రశేఖర్, పరుశరాం పాల్గొన్నారు.

డంపింగ్‌యార్డ్ వద్దు

● ప్యారానగర్‌కు మహానగర చెత్త తరలిస్తే ఊరుకోం

● పనులను అడ్డుకున్న గ్రామస్థులు

● జాతీయ రహదారిపై ఆందోళన.. ధర్నా

గుమ్మడిదల, ఫిబ్రవరి 8: హైదరాబాద్ మహానగరంలో సేకరించిన చెత్తను గుమ్మడిదల మండలం నల్లవల్లి గ్రామపంచాయతీ పరిధిలోని ప్యారానగర్ శివారులో డంపింగ్ చేసేందుకు అధికారులు చేపట్టిన పనులను పలు గ్రామాల వారు అడ్డుకున్నారు. ఇక్కడ డంపింగ్ యార్డ్ ఏర్పాటు కోసం అధికారులు అటవీ ప్రాంతంలో రోడ్డు వేసేందుకు గురువారం చెట్లను నరికే పనులు మొదలుపెట్టారు. విషయం తెలుసుకున్న ప్యారానగర్, నల్లవల్లి, కొత్తపల్లి, మంబాపూర్ గ్రామాల వారు వెళ్లి ఈ పనులను అడ్డుకున్నారు. తమ ప్రాంతంలో డంపింగ్ యార్డ్ వద్దంటూ మొరపెట్టుకుంటున్నా.. మొండిగా ఇక్కడే ఏర్పాటు చేస్తున్నారంటూ గురువారం మెదక్-హైదరాబాద్ జాతీయ రహదారిపై గుమ్మడిదల మండలం నల్లవల్లి గ్రామశివారులో పెద్ద ఎత్తున బైఠాయించి ధర్నాకు దిగారు. తాము ఇన్ని రోజులు ఆరోగ్యంగా బతికామని, చెత్త డంపింగ్ వల్ల అనారోగ్యంతోపాటు వ్యవసాయం చేయలేని పరిస్థితి నెలకొంటుందని, పచ్చని వాతావరణంలో ఉండే అటవీ ప్రాంతం సైతం నాశనమవుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. గతంలోనూ డంపింగ్ యార్డు వ్యతిరేకంగా ఆందోళన చేసిన విషయాన్ని గుర్తు చేశారు. ఈ సర్వే నెంబర్‌లో అన్ని పట్టాభూములేనని, అటవీ.. ప్రభుత్వ భూములు లేవన్నారు. గతంలో ఓ అధికారి తప్పుడు నివేదిక ఇవ్వడంతో డంపింగ్ యార్డ్ సమస్య వచ్చిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇక్కడ డంపింగ్ యార్డ్ ఏర్పాటు చేస్తే.. ప్రాణాలు పణంగా పెట్టి అయినా అడ్డుకుంటామని హెచ్చరించారు. డంపింగ్ యార్డ్ వద్దంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. గ్రామస్థుల ఆందోళనతో జాతీయ రహదారిపై ఇరువైపులా కిలోమీటర్ మేర వాహనాలు నిలిచి.. ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు. ఆందోళనకు ఎంపీపీ సద్ది ప్రవీణభాస్కర్‌రెడ్డి, జడ్పీటీసీ సభ్యుడు కుమార్‌గౌడ్, బీఆర్‌ఎస్ మండల పార్టీ అధ్యక్షులు ఎండీ హుస్సేన్, ఎంపీటీసీ ప్రభాకర్‌రెడ్డి, సర్పంచ్ దోమడుగు శంకరులు మద్దతు తెలిపారు. తహసీల్దార్ గంగాభవానీ, జిన్నారం సీఐ సుధీర్‌కుమార్, గుమ్మడిదల ఎస్‌ఐ లక్ష్మారెడ్డిలు వచ్చి గ్రామస్థులకు నచ్చజెప్పే ప్రయత్నం చేశారు. విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు.



డంపింగ్ యార్డు కోసం రోడ్డు వేసేందుకు చెట్లను తొలగించిన దృశ్యం



డంపింగ్‌యార్డు ఏర్పాటుతో వచ్చే సమస్యలను తహసీల్దార్ గంగాభవానికి వివరిస్తున్న జడ్పీటీసీ కుమార్‌గౌడ్

ఫైరింగ్ శిక్షణతో పోలీసులకు ఆత్మవిశ్వాసం

నంగునూరు, ఫిబ్రవరి 8 : పోలీసులకు ఇచ్చే ఫైరింగ్ శిక్షణ వారిలో ఆత్మవిశ్వాసం నింపుతుందని సిద్దిపేట పోలీస్ కమిషనర్ అనురాధ అన్నారు. గురువారం నంగునూరు మండలం రాజగోపాలపేట పోలీస్‌స్టేషన్ పరిధిలో జిల్లాలో ఉన్న పోలీస్ అధికారులు, సిబ్బందికి నిర్వహించిన వార్షిక ఫైరింగ్ శిక్షణలో ఆమె మాట్లాడారు. ఈ శిక్షణ ద్వారా అధికారులు, సిబ్బంది వ్యూహాత్మకంగా ఆలోచించగలుగుతారని తెలిపారు. రిజర్వ్ ఇన్‌స్పెక్టర్లు పూర్ణచందర్, ధరణి కుమార్, ఆర్‌ఎస్‌ఐలు, కార్తీక్, రంజిత్, రోహిత్, సాయి చరణ్ సూచనలు చేశారు. కార్యక్రమంలో అడిషనల్ డీసీపీ అడ్మిన్ అందె శ్రీనివాసరావు, ఏఆర్ అడిషనల్ డీసీపీ సుభాశ్ చంద్రబోస్, హుస్నాబాద్ ఏసీపీ సతీష్, గజ్వేల్ ఏసీపీ రమేష్, సిద్దిపేట ఏసీపీ సురేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ఫైరింగ్ శిక్షణలో పోలీస్ అధికారులు

ఆయిల్‌పామ్ సాగుకు ప్రోత్సాహం

మాసాయిపేట, ఫిబ్రవరి 8: ఆయిల్‌పామ్ సాగుకు ప్రభుత్వ ప్రోత్సాహం అందిస్తున్నదని, రైతులు ఉత్సాహంతో ముందుకు వచ్చి ఆయిల్‌పామ్ సాగు చేయాలని మెదక్ కలెక్టర్ రాజర్షిషా సూచించారు. గురువారం హకీంపేటలో అయిల్‌పామ్ మొక్కలను కలెక్టర్ గమనించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లాలో ఐదువేల ఎకరాల్లో ఆయిల్‌పామ్ సాగు చేయాలని ప్రభుత్వం సూచించినట్లు తెలిపారు. వేల మంది ముందుకు వచ్చి డీడీలు తీశారని జిల్లా వ్యాప్తంగా ఇప్పటివరకు 600 ఎకరాల్లో ఆయిల్‌పామ్ మొక్కలు నాటారని వెల్లడించారు. మరింత మంది రైతులు ముందుకు రావాలని కలెక్టర్ సూచించారు.

ఎరువుల దుకాణాల్లో తనిఖీ

హత్నూర, ఫిబ్రవరి 8: హత్నూర మండల పరిధిలోని హత్నూర, దౌల్తాబాద్ గ్రామాల్లో ఉన్న ఎరువుల దుకాణాలను జిల్లా వ్యవసాయ అధికారి నర్సింహారావు గురువారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. యూరియా కొరత తలెత్తకుండా ముందు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ప్రస్తుత వాతావరణ పరిస్థితులలో వరి పంటకు కాండం తొలిచే పురుగు ఉధృతి ఎక్కువగా ఉన్నందున యూరియాను తక్కువగా వాడాలని తెలిపారు. కార్టాప్ హైడ్రోక్లోరైడ్ 4 గ్రాములు, గుళికలు 8కిలోలు ఎకరానికి వేసుకోవాలని సూచించారు. ఆయనవెంట మండల వ్యవసాయ అధికారి శ్రీనివాసరావు, వ్యవసాయ విస్తరణ అధికారులు ప్రేమ్‌రాజ్, స్రవంతి, రైతులు ఉన్నారు.

రోడ్లపైనే వాహనాల పార్కింగ్

- జహీరాబాద్‌లో సెట్‌బ్యాక్, పార్కింగ్ స్థలం లేకుండానే భవనాల నిర్మాణం
- చేసేదిలేక రోడ్డుపైనే వాహనాలను నిలుపుతున్న ప్రజలు
- ప్రేక్షకపాత్ర పోషిస్తున్న యంత్రాంగం



జహీరాబాద్ పట్టణంలోని ప్రధాన రహదారిపైనే వాహనాలు నిలిపిన చేసిన దృశ్యం

జహీరాబాద్, ఫిబ్రవరి 8: జహీరాబాద్ పట్టణంలో రోడ్డుపైనే వాహనాల పార్కింగ్ చేస్తుండడంతో నిత్యం ట్రాఫిక్‌జామ్ ఏర్పడుతున్నది. ఆయా మార్గాల్లో వెళ్లే ప్రజలు, ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. నియోజకవర్గంలోని ఆయా గ్రామాలకు చెందిన ప్రజలు అనేక పనుల నిమిత్తం ప్రతీరోజు వందల సంఖ్యలో జహీరాబాద్ పట్టణానికి వస్తుంటారు. జహీరాబాద్ పట్టణంలోని ప్రధాన రోడ్డు సుమారు 200అడుగుల వెడల్పుతో ఉన్నప్పటికీ రోడ్లపైనే వ్యాపారాలు నిర్వహిస్తుండడం, వాహనాలు నిలపడం, ప్రజల రద్దీ ఎక్కువగా ఉండడంతో రోడ్డంతా ఇరుకుగా మారింది. పట్టణంలోని ప్రధాన రహదారిపై ఉన్న వ్యాపార సముదాయాలను సెట్‌బ్యాక్, పార్కింగ్ స్థలం లేకుండానే నిర్మించడంతో పనుల నిమిత్తం వచ్చిన ప్రజలు తమ వాహనాలను రోడ్డుపైనే నిలుపుతున్నారు. దీంతో సంబంధిత అధికారులు రోడ్లపై పార్కింగ్ చేసిన వాహనాలకు జరిమానా విధించడం తప్పా భవనాల యజమానులపై చర్యలు తీసుకోవడం లేదు. భవనాల యజమానులపై చర్యలు చేపట్టక పోవడంపై ప్రజలు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. సెట్‌బ్యాక్, పార్కింగ్ స్థలం లేకుండా భవనాలు నిర్మించిన వారిపై చర్యలు చేపట్టి, పార్కింగ్‌కు స్థలం కేటాయించేలా చూడాలని వాహనదారులు అధికారులను కోరుతున్నారు. అలాగే కర్మాగారాల యాజమాన్యాలు సైతం తమ కార్మికుల వాహనాలను రోడ్లపక్కన పార్కింగ్ చేయిస్తుండడం గమనార్హం. మొగుడంపల్లి వెళ్లే రోడ్డుపై ముంగి కర్మాగారం వద్ద గతంలో రోడ్డుపక్కనే వాహనాలను పార్కింగ్ చేయడంతో ఆర్టీసీబస్సు-ఆటో ఢీకొని 9మంది మృతిచెందారు. ఇంత జరుగుతున్నా అధికారులు మాత్రం ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదు.

చర్యలు తీసుకుంటాం



రోడ్లపై, రోడ్లకు ఇరువైపులా వాహనాలను నిలిపితే కఠిన చర్యలు తీసుకుంటాం. వ్యాపార సంస్థలు, కర్మాగారాలు పక్కగా పార్కింగ్ స్థలాలను కేటాయించాలి. పట్టణంలో ట్రాఫిక్‌జామ్ అయితే అందుకు వాహనదారులు, వ్యాపారసంస్థల నిర్వాహకులే బాధ్యులవుతారు.

- రాజబోయిన రవి, జహీరాబాద్ పట్టణ సీఐ

గురుకుల ప్రవేశ పరీక్ష కోసం ఏర్పాట్లు చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న మెదక్ అదనపు కలెక్టర్ రమేష్

మెదక్ అర్బన్, ఫిబ్రవరి 8: గురుకులాల్లో ఐదవ తరగతి ప్రవేశాల కోసం నిర్వహించే ప్రవేశ పరీక్షకు అన్ని ఏర్పాట్లు చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ రమేష్ అధికారులను ఆదేశించారు. గురువారం ఆయన ఛాంబర్‌లో గురుకులాల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పరీక్ష నిర్వహణ కోసం మెదక్‌లో 2, రామాయంపేట, కొల్చారం, తూప్రాన్, తునికిలో ఒకటి చొప్పున మొత్తం 6 కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. ఈ నెల 11న ఉదయం 11 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు పరీక్ష జరుగుతుందన్నారు. ఈ పరీక్షకు 2,540 మంది విద్యార్థులు హాజరుకానున్నట్లు ఆయన పేర్కొన్నారు. అన్ని కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుందన్నారు. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని వసతులు కల్పించాలని సూచించారు. ఈ సమావేశంలో జిల్లా అదనపు ఎస్పీ మహేందర్, గురుకులాల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

హుడా స్థలాలను రక్షించాలని బీజేపీ వినతి

జిన్నారం, ఫిబ్రవరి 8: బొల్లారం హుడా స్థలాలను పూర్తి స్థాయిలో సర్వే చేసి కాపాడాలని బీజేపీ నాయకులు కోరారు. గురువారం బొల్లారం మున్సిపాలిటీలోని సెక్రటరీ చంద్రయ్యకు బీజేపీ రాష్ట్ర, జిల్లా నాయకులు రాజలింగం, రవీందరొరెడ్డి, రాఘవేందర్‌రెడ్డి, వెంకటయ్య, గోపి వినతిపత్రాన్ని అందజేశారు. బొల్లారంలోని హుడా స్థలంలో అక్రమ నిర్మాణాలు జరుగుతున్నాయని, దేవుళ్లగుట్ట ప్రాంతంలో అన్యమతాలకు చెందిన ప్రార్థనా మందిరాలను నిర్మిస్తున్నారని ఆరోపించారు. దేవుళ్ల గుట్ట ప్రాంతంతో పాటు హుడా భూములను పూర్తి స్థాయిలో సర్వే చేసి రక్షించాలని వారు కోరారు.

కుట్టుమిషన్ల పంపిణీ

జిన్నారం: మాధారంలో నియోజిన్ పరిశ్రమ ఆధ్వర్యంలో మహిళలకు గురువారం కుట్టు మిషన్లను అందజేశారు. మాజీ సర్పంచ్ సురేందర్‌గౌడ్, నియోజిన్ పరిశ్రమ ప్రతినిధి శ్యామ్ సుందర్, డైరెక్టర్ సతీష్, మేనేజర్ చందులు మహిళలకు కుట్టుమిషన్లు పంపిణీ చేశారు. మహిళలు ఆర్థిక వృద్ధి, స్వయం ఉపాధి కోసం తమ సంస్థ తరఫున సహకారం అందిస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో పంచాయతీ ప్రత్యేక అధికారి మల్లేశం, కార్యదర్శి కుమార్, నాయకులు గణేష్, మహిళలు పాల్గొన్నారు.

గురుకుల విద్యార్థులకు అవగాహన

నర్సాపూర్: నర్సాపూర్ గిరిజన గురుకుల విద్యార్థులకు గురువారం ప్రకృతి వైపరీత్యాల రక్షణ దళాలు కల్పిస్తున్న రక్షణ అంశాలపై అవగాహన కల్పించారు. గురువారం ఆర్డీవో శ్రీనివాసులు, తహసీల్దార్ కమలాద్రి, సీఐ మన్‌మోహన్‌యాదవ్, ఆర్ఐ ఫైసల్ కార్యక్రమంలో పాల్గొన్నారు. భూకంపాలు, వరదలు, తుఫానులతో పాటు ఇతర ప్రకృతి వైపరీత్యాలు వచ్చినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రతలతో పాటు వాటి నుంచి ప్రాణాలను రక్షించుకునే విధానాలు వివరించారు.

సీఎంను కలిసిన మాజీ ఎంపీ

నారాయణఖేడ్: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని గురువారం ఆయన నివాసంలో జహీరాబాద్ మాజీ ఎంపీ సురేష్‌షెట్కార్ మర్యాదపూర్వకంగా కలిశారు. రాజకీయాలకు సంబంధించిన పలు అంశాలను ముఖ్యమంత్రితో చర్చించినట్లు తెలిసింది. ఆయన వెంట మంత్రి పొన్నం ప్రభాకర్ ఉన్నారు.

అన్ని రంగాల్లో మండల అభివృద్ధి



అంబాజీపేటలో అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణ పనులను ప్రారంభిస్తున్న ఎంపీపీ భాగ్యలక్ష్మీగోపాల్‌రెడ్డి

చిన్నశంకరంపేట, ఫిబ్రవరి 8: చిన్నశంకరంపేట మండలాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తానని ఎంపీపీ ఆవుల భాగ్యలక్ష్మీగోపాల్‌రెడ్డి అన్నారు. గురువారం అంబాజీపేటలో అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణ పనులను ఆమె ప్రారంభించారు. ఈ సదర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ.. ఎమ్మెల్యే రోహిత్‌రావు సహకారంతో రూ.2.25కోట్లు మంజూరైనట్లు తెలిపారు. ఉమ్మడి మండలంలోని శేరిపల్లి గ్రామానికి రూ.15లక్షలు, చందాపూర్‌కు రూ.10లక్షలు, కొర్విపల్లికి రూ.25లక్షలు, చిన్నశంకరంపేటకు రూ.50లక్షలు, గవ్వపల్లి, కొండాపూర్, జంగరాయి, సూరారం, మలుపల్లి గ్రామాలకు రూ.25లక్షల చొప్పున ఎన్ఆర్ఈజీఎస్ నిధులు మంజూరైనట్లు వెల్లడించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ జయమ్మ, మాజీ సర్పంచులు సత్యనారాయణ, సాయిలు, మాజీ సొసైటీ చైర్మన్ గోపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జిన్నారం సీఐగా సుధీర్‌కుమార్

జిన్నారం, ఫిబ్రవరి 8: జిన్నారం సీఐగా సుధీర్‌కుమార్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ సీఐగా పని చేసిన వేణుకుమార్ బదిలీపై వెళ్లగా ఆయన స్థానంలో సంగారెడ్డి రూరల్ సీఐగా పనిచేస్తున్న సుధీర్‌కుమార్ సీఐగా వచ్చారు. మండల ప్రజలు, నాయకుల సహకారంతో శాంతి భద్రతల రక్షణకు కృషి చేస్తామని ఆయన తెలిపారు.

కంగ్టి సీఐగా శ్రావణ్‌కుమార్

కంగ్టి, ఫిబ్రవరి 8: కంగ్టి సీఐగా బి. శ్రావణ్‌కుమార్ నియామకమయ్యారు. ఇక్కడ సీఐగా పని చేసిన జక్కుల హన్మంతు సస్పెన్షన్‌కు గురయ్యారు. దీంతో ఆయన స్థానంలో హైదరాబాద్‌లో సీఐగా పని చేసిన శ్రావణ్‌కుమార్ బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఈ మేరకు ఆయన బాధ్యతలు స్వీకరించారు. శాంతిభద్రతల పరిరక్షణకు కృషి చేస్తానని తెలిపారు.

రాష్ట్రాల హక్కులను హరిస్తున్న కేంద్ర ప్రభుత్వం

- సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మల్లికార్జున్

సంగారెడ్డి రూరల్, ఫిబ్రవరి 8: రాష్ట్రాల హక్కులను కేంద్ర ప్రభుత్వం హరిస్తున్నదని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మల్లికార్జున్ విమర్శించారు. కేరళ ప్రభుత్వానికి సంఘీభావంగా గురువారం సంగారెడ్డిలోని సుందరయ్య భవన్ నుంచి ప్రభుత్వ అతిథి గృహం వరకు ర్యాలీగా వెళ్లి ధర్నా చేశారు.



ప్రభుత్వ అతిథి గృహం ఎదుట సీపీఎం, సీఐటీయూ నాయకుల ధర్నా

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం తెచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లను కేరళ ప్రభుత్వం అమలు చేయకుండా కార్మిక వర్గానికి అండగా నిలిచినందున కక్షపూరితంగా వ్యవహరిస్తున్నదని మండిపడ్డారు. కేరళ ప్రభుత్వం కార్మిక, రైతులు, ప్రజలకు అన్ని విధాల సంక్షేమ పథకాలు అందజేస్తూ ఆదర్శంగా నిలుస్తుండడం జీర్ణించుకోలేని కేంద్రం కక్షసాధింపు చర్యలకు పాల్పడడం సిగ్గుచేటన్నారు. బీజేపీ పాలిత రాష్ట్రాలకు నిధులు కేటాయిస్తూ ఇతర రాష్ట్రాలపై వివక్ష చూపిస్తున్నదని ఆరోపించారు. కేంద్రానికి కార్మికవర్గం తగిన గుణపాఠం చెబుతుందని జోస్యం చెప్పారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మల్లేశం, జీ.సాయిలు, నాయకులు యాదగిరి, ప్రవీణ్, రమేష్, అలీ, వేణుగోపాల్, సువర్ణ, శ్రీనివాస్, మల్లారెడ్డి, కార్మికులు పాల్గొన్నారు.

మొక్కుబడిగా కోహీర్ సర్వసభ్య సమావేశం

- పలువురు ఎంపీటీసీలు, అధికారుల గైర్హాజరు
- కేవలం గంటలోనే సమావేశం ముగింపు

కోహీర్, ఫిబ్రవరి 8: కోహీర్‌లోని ఎంపీపీ కార్యాలయంలో గురువారం ఎంపీపీ అధ్యక్షురాలు మాధవి అధ్యక్షతన నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశం మొక్కుబడిగా కొనసాగింది. ఉదయం 11 గంటలకు ప్రారంభం కావాల్సిన సమావేశం ప్రజాప్రతినిధులు, అధికారుల ఆలస్యం కారణంగా 11.30 గంటల తర్వాతా ప్రారంభమైంది. మండలంలో 16 మంది ఎంపీటీసీలు ఉండగా సమావేశానికి కేవలం 8 మంది మాత్రమే హాజరయ్యారు. అందులో ఇద్దరు బీఆర్ఎస్ పార్టీకి చెందినవారు కాగా ఆరుగురు ఎంపీటీసీలతో పాటు జడ్పీటీసీ, ఎంపీపీ కాంగ్రెస్ పార్టీకి చెందిన వారే ఉన్నారు. అలాగే వివిధ శాఖల అధికారులు కూడా గైరాజరయ్యారు. తమ కిందిస్థాయి సిబ్బందిని సమావేశానికి పంపించారు. గ్రామాల్లో నెలకొన్న సమస్యలను సమావేశంలో ప్రజా ప్రతినిధులు ఒక్కరు కూడా ప్రస్తావించలేదు. కేవలం విద్యుత్ సరఫరాలో కలుగుతున్న ఇబ్బందులను తొలగించాలని మాత్రమే కోరారు. సర్పంచుల పదవీ కాలం పూర్తయిన తర్వాత ప్రత్యేక అధికారులతో కూడిన మొదటి సర్వసభ్య సమావేశం కేవలం గంటలోనే ముగించడం గమనార్హం. సమావేశంలో డీఆర్డీవో సూర్యరావు, తహసీల్దార్ శాంతకుమారి, జడ్పీటీసీ రాందాస్, ఎంపీటీసీలు అనిత, లావణ్య, మల్లన్న పాటిల్, సమియోద్దీన్, శ్రీనివాస్, భీమ్‌సింగ్, బక్కరెడ్డి, రత్నయ్య, కో-ఆప్షన్ సభ్యులు లైయిక్ ఎంపీడీవో సుజాతనాయక్, ఏఈవో నవీన్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ తులసి, ఎంఈవో శంకర్, విద్యుత్ శాఖ ఏఈ మనీష్, డాక్టర్ నవీన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దార్ శాంతకుమారి

ఆరు గ్యారంటీలను తప్పకుండా అమలు చేస్తాం

- గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే నర్సారెడ్డి
- తూప్రాన్‌లో నర్సారెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరికలు

తూప్రాన్, ఫిబ్రవరి 8: కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో హామీలో ఇచ్చిన ఆరు గ్యారంటీ పథకాలను తప్పకుండా అమలు చేస్తుందని గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ పార్టీ సిద్దిపేట జిల్లా అధ్యక్షుడు తూంకుంట నర్సారెడ్డి పేర్కొన్నారు. గురువారం తూప్రాన్ పట్టణానికి చెందిన మాజీ వార్డు సభ్యుడు దుర్గం నగేశ్ ఆధ్వర్యంలో తుమ్మట శ్రీనివాస్‌యాదవ్, రేపల్లె రాజు, పెద్దరాజు, శంకర్, దుర్గం ప్రదీప్, సాయిరాం, సంపత్, జక్కపురం వెంకటేశ్, యాదగిరి పలువురు నాయకులు నర్సారెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇప్పటికే రెండు గ్యారంటీ పథకాలు అమలు చేసినట్లు వివరించారు. త్వరలోనే మరో రెండు పథకాలు అమలు చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు పల్లెర్ల రవీందర్‌గుప్తా, కౌన్సిలర్ జిన్న భగవాన్‌రెడ్డి, నాయకులు నాగరాజుగౌడ్, కృష్ణారెడ్డి, బొగ్గుల సురేష్, ఉమర్, అనిల్ తదితరులు పాల్గొన్నారు.



తూప్రాన్‌లో నర్సారెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరికలు

బోనం ఎత్తిన మెదక్

మెదక్ అర్బన్, ఫిబ్రవరి 8: మాఘ అమవాస్యను పురస్కరించుకొని మెదక్ పట్టణమంతా అమ్మోరి నామస్మరణతో పులకరించింది. గల్లీగల్లీలోనూ ఆధ్యాత్మికం వెల్లివిరిసింది. గురువారం గంగపుత్ర సంఘం ఆధ్వర్యంలో పసుపులేరు ఒడ్డున వెలిసిన గంగమ్మతల్లికి ఘనంగా బోనాలు ఊరేగింపు నిర్వహించారు. పిట్లంబేస్, సుభాష్‌కాలనీ, దాయర, ఫతేనగర్‌తో పాటు ఆయా వార్డుల్లోని మహిళలు బోనం ఎత్తుకొని డప్పు వాయిద్యాల మధ్య శివసత్తుల పునకాలు, పోతరాజుల నృత్యాలు, యువత కేరింతతో అత్యంత వైభవంగా బోనాల ఊరేగింపు నిర్వహించారు. ఉత్సవాలకు మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్‌రావు హాజరై, పూజలు నిర్వహించారు.



గంగమ్మ తల్లికి బోనాలు ఊరేగింపు నిర్వహిస్తున్న దృశ్యం

చెరువు కట్టకు మరమ్మతులు చేపట్టరా?

- వర్షాకాలం లోపు చేయాల్సిందే
- లేదంటే వానలకు కొట్టుకుపోయే ప్రమాదం
- ఆందోళన వ్యక్తం చేస్తున్న రైతులు

నర్సాపూర్, ఫిబ్రవరి 8: గతేడాది కురిసిన వర్షాలతో నర్సాపూర్ మండలం చిన్నచింతకుంట ఆముదాల చెరువు కట్ట కుంగి పెద్ద ఎత్తున బీటలు వారి కోతకు గురైంది. అయినప్పటికీ మరమ్మతుకు నిధులు కేటాయించకపోవడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ చెరువు కింద సుమారు వంద ఎకరాల వరకు పంట సాగవుతుంది. గత వర్షాకాలంలో కట్ట కుంగి పెద్ద ఎత్తున కోతకు గురికావడంతో రైతులే రూ.50వేలు చెల్లించి తాత్కాలికంగా మరమ్మతులు చేపట్టారు. నీటిపారుదల శాఖ అధికారులు కట్టను పరిశీలించి మరమ్మతులకు సుమారు రూ.15లక్షలు ఖర్చవుతుందని నిర్ధారించారు. ఉన్నతధికారులకు ప్రతిపాదనలు కూడా పంపారు కానీ నిధులు మంజూరు కాలేదు. ప్రస్తుతం ఆ చెరువులో పుష్కలంగా నీరు ఉండడంతో మళ్లీ వానలు పడితే మరింత ప్రమాదకరంగా మారనుంది. ఆలోపే మరమ్మతు చేస్తే కట్ట పటిష్టంగా ఉంది. లేదంటే వర్షాలకు కట్ట కొట్టుకుపోయి, చెరువు కింద పొలాలతో పాటు గ్రామానికి కూడా నష్టం వాటిల్లే అవకాశముందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కొత్తగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వమైనా కట్ట మరమ్మతుకు అవసరమైన నిధులు వెంటనే వచ్చేలా ఎమ్మెల్యే సునీతారెడ్డితో పాటు అధికార పార్టీ నాయకులు చొరవ తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.



కుంగి, కోతకు గురైన చిన్నచింతకుంట ఆముదాల చెరువు కట్ట

పండరీపూర్ క్షేత్రానికి దిండియాత్ర

నారాయణఖేడ్/నాగల్‌గిద్ద, ఫిబ్రవరి 8: మహారాష్ట్రలోని పవిత్ర పుణ్యక్షేత్రమైన పండరీపూర్‌లోని రుక్మిణీపాండురంగ ఆలయానికి గురువారం ఖేడ్ మున్సిపల్ పరిధిలోని చాంద్ ఖాన్‌పల్లి నుంచి అట్టహాసంగా దిండియాత్ర ప్రారంభించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాదయాత్రగా బయలు దేరారు. ఖేడ్ రామమందిర్‌లో ప్రత్యేక పూజలు చేసిన అనంతరం దిండి యాత్ర ప్రారంభమైంది. అలాగే నాగల్‌గిద్ద మండల కేంద్రంలో గల దత్తాత్రి మందిరం నుంచి దిండియాత్ర ప్రారంభించారు. ఈ యాత్రలో డీసీసీ ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి, డీసీసీబీ మాజీ చైర్మన్ జైపాల్‌రెడ్డి, ప్రణాళిక సంఘం మాజీ సభ్యుడు నగేష్‌షెట్కార్, పీఏసీఎస్ చైర్మన్ శ్రీకాంత్, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు మాణిక్‌రావు, సంజీవ్‌పాటిల్ పాల్గొన్నారు.

భూ సేకరణకు గ్రామసభలు

నారాయణఖేడ్, ఫిబ్రవరి 8: నారాయణఖేడ్ - నిజాంపేట- బీదర్ 161బీ జాతీయ రహదారి విస్తరణ కోసం భూ సేకరణలో భాగంగా భూములు కోల్పోతున్న రైతులతో గురువారం నిజాంపేట మండలం ర్యాలమడుగు, మనూరు మండలం పుల్‌కుర్తిల్లో గ్రామసభలను ఏర్పాటు చేశారు. స్థానిక ఆర్డీవో వెంకటేష్ సేకరణ చేపట్టనున్న భూములు, వాటికి సంబంధించిన పరిహారం తదితర విషయాలను రైతులకు వివరించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్లు రాజ గణేష్, మల్లేష్, ఎంఆర్ఐలు రాంచందర్, తాజోద్దీన్, శంకర్ రెడ్డి, రోడ్లు భవనాల శాఖ ఏఈ శ్రీకాంత్, పంచాయతీల కార్యదర్శులు భార్గవి ఇమ్రాన్ తదితరులు పాల్గొన్నారు.

'భూసార పరీక్షలు చేయించాలి'

జహీరాబాద్, ఫిబ్రవరి 8: రైతులు విధిగా భూసారపరీక్షలను చేయించుకునేలా ప్రోత్సహించాలని కేవీకే శాస్త్రవేత్తలు శైలజ, హేమలత, స్వామి, సాయి ప్రియాంకలు పేర్కొన్నారు. గురువారం పట్టణంలోని సిద్ధేశ్వర ఆలయ సమీపంలోని పొలంలో ఆచార్య కొండాలక్ష్మణ్ విశ్వవిద్యాలయ విద్యార్థులకు వ్యవసాయసాగు విధానం, తదితరాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ రైతులు పంటలను వేసింది మొదలుకుని పంట చేతికొచ్చేవరకు చేపట్టాల్సిన కార్యకలాపాల గురించి విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో శాస్త్రవేత్తలు, విద్యార్థులు పాల్గొన్నారు.

పేకాట స్థావరంపై దాడులు

పటాన్‌చెరు రూరల్, ఫిబ్రవరి 8 : ఇస్నాపూర్‌లో పేకాట స్థావరంపై జరిపిన దాడుల్లో ఇస్నాపూర్ ఎంపీటీసీ అంజిరెడ్డితో పాటు మరో 11 మందిని స్పెషల్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వీరితోపాటు నాలుగు బైక్‌లు, 12 సెల్‌ఫోన్లు, రూ. 96,000 నగదును సీజ్ చేశారు. తదుపరి విచారణ కోసం నిందితులను పటాన్‌చెరు పోలీసు స్టేషన్‌కు తరలించారు.

ఎమ్మెల్సీ కవితను కలిసిన బీరయ్య

సంగారెడ్డి రూరల్, ఫిబ్రవరి 8: ఎమ్మెల్సీ కవితను బీసీ సంక్షేమ సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి బీరయ్యయాదవ్ గురువారం హైదరాబాద్‌లోని ఆమె నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. బీఆర్ఎస్ మెదక్ ఎంపీ టికెట్ తనకు ఇప్పించాలని కోరారు. అనంతరం నర్సాపూర్ ఎమ్మెల్యే సునితాలక్ష్మారెడ్డిని కలిసి తనకు మద్దతు ఇవ్వాలని కోరారు. వారిద్దరూ సానుకూలంగా స్పందించినట్లు బీరయ్య తెలిపారు.

డ్రైనేజీ వ్యవస్థ పునరుద్ధరణకు నిధులివ్వండి



జలమండలి ఎండీకి వినతిపత్రాన్ని అందజేస్తున్న కార్పొరేటర్లు

పటాన్‌చెరు, ఫిబ్రవరి 8: పటాన్‌చెరు డివిజన్ పరిధిలో పురాతన డ్రైనేజీ వ్యవస్థను పునరుద్ధరించేందుకు రూ.1.15కోట్ల నిధులు మంజూరు చేయాలని కోరుతూ హైదరాబాద్ జలమండలి ఎండీ సుదర్శన్‌రెడ్డికి గురువారం కార్పొరేటర్లు మెట్టు కుమార్‌యాదవ్, పుష్పనగేష్ వినతిపత్రాన్ని అందజేశారు. డివిజన్ పరిధిలోని ఏపీ కాలనీ, శాంతినగర్, గౌతంనగర్ కాలనీ, రామచంద్రాపురం డివిజన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో పురాతన డ్రైనేజీ వ్యవస్థ శిథిలమైందన్నారు. వర్షాకాలంలో డ్రైనేజీలు వరదనీటితో ఉప్పొంగి లోతట్టు ప్రాంతాలు జలమయం అవుతున్నాయని వివరించారు. సమస్యను శాశ్వతంగా పరిష్కరించేందుకు డ్రైనేజీ వ్యవస్థను ఆధునీకరించాల్సిన అవసరం ఉందని ఎండీకి వివరించారు. కాగా నిధులు మంజూరు చేసేందుకు ఎండీ సుదర్శన్‌రెడ్డి సానుకూలంగా స్పందించినట్లు కార్పొరేటర్లు తెలిపారు.

చికిత్స పొందుతున్న మహిళ మృతి

నిజాంపేట, ఫిబ్రవరి 8: నాలుగు రోజుల క్రితం చీరకు నిప్పంటుకుని తీవ్రంగా గాయపడిన మహిళ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందింది. మండల పరిధిలోని కల్వకుంట గ్రామానికి చెందిన కోమండ్ల సువర్ణ(53) ఆదివారం పూజగదిలో ప్రమాదవశాత్తు చీరకు నిప్పంటుకొని తీవ్రంగా గాయపడింది. మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ గురువారం మృతి చెందింది.

'ప్రధాని మోదీ సారథ్యంలో దేశాభివృద్ధి'

పాపన్నపేట, ఫిబ్రవరి 8: ప్రధాని మోదీ సారథ్యంలోనే దేశాభివృద్ధి సాధ్యమని బీజేపీ జిల్లా అధ్యక్షుడు గడ్డం శ్రీనివాస్ అన్నారు. గురువారం పాపన్నపేటలో నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. మోదీ నాయకత్వంలో దేశం అంచెలంచెలుగా అభివృద్ధి చెందుతున్నదన్నారు. బీజేపీ కార్యకర్తలు, నాయకులు పల్లెల్లో ఇంటింటికి తిరుగుతూ కేంద్రపథకాల గురించి వివరించాలని సూచించారు. పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ గెలుపే ధ్యేయంగా పని చేయాలన్నారు. అనంతరం పాపన్నపేట మండల బీజేపీ అధ్యక్షుడిగా బీకొండ రాములకు నియామకపత్రాన్ని అందజేశారు. సమావేశంలో సీనియర్ నాయకులు సుధాకర్, కిష్టయ్య, విఠల్, నరేష్, చంద్రయ్య, వినోద్ పాల్గొన్నారు.

బీజేపీ సీనియర్ నాయకుడికి సన్మానం

పెద్దశంకరంపేట: పెద్దశంకరంపేటలోని పార్టీ కార్యాలయంలో గురువారం బీజేపీ సీనియర్ నాయకుడు, డీసీసీ మాజీ చైర్మన్ జైపాల్‌రెడ్డిని మండలాధ్యక్షుడు కోణం విఠల్ ఆధ్వర్యంలో సన్మానించారు. పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ మూడోసారి కేంద్రంలో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడం ఖాయమని ఈ సందర్భంగా జైపాల్‌రెడ్డి అన్నారు. కార్యక్రమంలో మండల నాయకులు బండాల శ్రావణ్‌కుమార్, అనిల్, విజయ్‌కుమార్, సుభాష్, అంజయ్య పాల్గొన్నారు.

బీజేవైఎం జిల్లా అధ్యక్షుడిగా సతీష్ పటేల్

మెదక్ అర్బన్: బీజేవైఎం మెదక్ జిల్లా అధ్యక్షుడిగా మెదక్ పట్టణానికి చెందిన సతీష్‌పటేల్‌ను నియమించినట్లు జిల్లా అధ్యక్షుడు గడ్డం శ్రీనివాస్ తెలిపారు. ఈ మేరకు గురువారం జిల్లా పార్టీ కార్యాలయంలో నియామక పత్రాన్ని అందజేశారు.

'గ్రామాల్లో అందరూ పరిశుభ్రతను పాటించాలి'

జహీరాబాద్, ఫిబ్రవరి 8: ప్రజలందరూ విధిగా పరిశుభ్రతను పాటించాలని మొగుడంపల్లి మండల ప్రత్యేకాధికారి మోహనమురళీ, జహీరాబాద్ మండల ప్రత్యేకాధికారి వసంత పేర్కొన్నారు. పారిశుధ్య వారోత్సవాల్లో భాగంగా జహీరాబాద్, మొగుడంపల్లి మండలాల్లోని ఆయా గ్రామాల్లో గురువారం శ్రమదానం, తడి, పొడిచెత్తను వేరుచేసే ప్రక్రియ, రహదారులపై చెత్తను, మట్టిదిబ్బల తొలగింపును చేపట్టారు. అందులో భాగంగా మొగుడంపల్లిలోని ఎస్టీ బాలికల గురుకుల పాఠశాలలో విద్యార్థులు, అధికారులు శ్రమదానం చేశారు. ఆయా కార్యక్రమాల్లో పంచాయతీ కార్యదర్శులు మల్లేష్‌గౌడ్, దత్తారెడ్డి, స్వప్న పాల్గొన్నారు.

నందగోకుల్‌లో ప్రత్యేక పారిశుధ్య వారోత్సవాలు

నిజాంపేట: నిజాంపేట మండల పరిధిలోని నందగోకుల్ గ్రామంలో గురువారం గ్రామ కార్యదర్శి చంద్రహాస్ ఆధ్వర్యంలో గ్రామంలో కాలువలు శుభ్రం చేశారు. ఈ సందర్భంగా కార్యదర్శి మాట్లాడుతూ ప్రతీ ఒక్కరు తమ ఇంటి పరిసరాల పరిశుభ్రత కోసం ప్రతిరోజు ఒక గంట శ్రమదానం చేయాలన్నారు.

'పాఠశాల అనుమతులు రద్దు చేయాలి'

తూప్రాన్, ఫిబ్రవరి 8: తూప్రాన్ పట్టణంలోని ప్రైవేటు పాఠశాల అనుమతి రద్దు చేయాలని బీఎస్పీ నాయకులు డిమాండ్ చేశారు. అక్షరా ప్లానెట్ పాఠశాలలో చిన్నారితో అసభ్యంగా ప్రవర్తించిన సంఘటనపై పాఠశాల వద్ద గురువారం ఆందోళన చేపట్టి, ఎంఈవోకు వినతిపత్రం అందజేశారు. పిల్లలకు రక్షణ కల్పించడంలో యాజమాన్యం విఫలమైందని ఆరోపించారు.

చిట్కుల్‌లో మాఘ స్నానాలకు ఏర్పాట్లు

చిలప్‌చెడ్, ఫిబ్రవరి 8: మండల పరిధిలోని చిట్కుల్ చాముండేశ్వరి ఆలయం వద్ద మాఘ స్నానాలు ఆచరించే భక్తుల కోసం సర్వం సిద్ధం చేస్తున్నట్లు ఆలయ ప్రధాన పూజారి ప్రభాకర శర్మ పేర్కొన్నారు. గురువారం ఆయన మాట్లాడుతూ.. మాఘ అమావాస్యను పురస్కరించుకుని భక్తులు ప్రతీ ఏడాది మంజీరా నదిలో స్నానాలు ఆచరించి, అమ్మవారిని దర్శించుకుంటారని తెలిపారు. కావున భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తగిన ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. ఆయన వెంట పూజారులు మోతిలాల్‌శర్మ, సుబ్రహ్మణ్య శర్మ తదితరులు ఉన్నారు.

మంజీరా నది వద్ద..

నారాయణఖేడ్: మాఘ అమావాస్యను పురస్కరించుకుని మనూరుమండలం బోరంచ వద్ద మంజీరా నదిలో భక్తులు స్నానాలు ఆచరించడానికి ఏర్పాట్లు చేసినట్లు బోరంచ సంగమేశ్వర కమిటీ సభ్యులు తెలిపారు. బోరంచ వద్ద మంజీరా నది ఉత్తరం వైపు నుంచి దక్షిణం వైపునకు ప్రవహిస్తున్నందున పుణ్య స్నానాలు ఆచరిస్తే సకల పాపాలు హరించుకుపోతాయన్నారు.